E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 13-08-2025 (వారం) బుధవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




9 పార్టీలకు ఈసీ నోటీసులు » 3లో

## ఆధార్‌ను పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేము సుప్రీంకోర్టు



తరువాయి 2 లో

## ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు పౌరసత్వాన్ని నిరూపించవు



తరువాయి 2 లో

## అదానీలపై మోదీ సర్కారు ప్రేమ



- సమన్లు అందించడంలో అలసత్వం..అమెరికా ఎస్ఈసీ

**నరేంద్ర మోదీ సర్కారు అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన దగ్గరి బంధువు సాగర్ అదానీలపై అలవిమాలిన ప్రేమ చూపిస్తోందని అమెరికా స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజీ కమిషన్...**

ఈ కబురు,న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ సర్కారు అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన దగ్గరి బంధువు సాగర్ అదానీలపై అలవిమాలిన ప్రేమ చూపిస్తోందని అమెరికా స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజీ కమిషన్ (ఎస్ఈసీ) పరోక్షంగా ఆరోపించింది. ఆంధ్రప్రదేశ్‌తో సహా కొన్ని రాష్ట్రాల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం వీరు ముడుపులు చెల్లించినట్టు వచ్చిన ఆరోపణలపై ఈ ఏడాది ఫిబ్రవరిలో తాము జారీ చేసిన సమన్లను.. మోదీ సర్కారు ఇప్పటికీ వారికి అందజేయలేదని న్యూయార్క్‌లోని ఈస్ట్రన్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి జేమ్స్ ఆర్ చో కి ఎస్ఈసీ తెలిపింది.

తరువాయి 2లో

## ఔటర్ వెలుపలకు కాలుష్య పరిశ్రమల తరలింపు వేగవంతం



» 3లో

## అమెరికాలో రోడ్డు ప్రమాదం హైదరాబాద్ యువతి దుర్మరణం



# బీ అలర్ట్!

- మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు
- కార్యాచరణతో అప్రమత్తంగా ఉండండి
- ఉద్యోగులకు సెలవులు రద్దు..
- అవసరమైతే బడులకు సెలవులివ్వండి
- కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**తెలంగాణవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షా లు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాబోయే 72 గంటలపాటు అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.**

హైదరాబాద్,ఈ కబురు: తెలంగాణవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాబోయే 72 గంటలపాటు అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముందస్తు కార్యాచరణపై రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తప్పిదాలకు తావు లేకుండా.. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రానున్న మూడు రోజులు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవులు రద్దు చేయాలని నిర్దేశించారు. ఆకస్మిక వరదలు వస్తే లోతట్టు ప్రాంతాల నుంచి ప్రజలను తరలించేందుకు, వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు హెలికాప్టర్లను సిద్ధం చేసి పెట్టుకోవాలని చెప్పారు. హైదరాబాద్‌తోపాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యవసర సమయంలో అందుబాటులో ఉండేందుకు వీలుగా టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, వరదల సమయంలో రాకపోకలు లేకుండా చూడాలని సూచించారు. "పశువులు, మేకలు, గొర్రెల కాపర్లు తరచూ వరదల్లో చిక్కుకుపోతున్నారు. వారిని అప్రమత్తం చేయాలి. పశు నష్టం జరగకుండా చూడాలి" అని సూచించారు. అధిక వర్షపాతం నమోదయ్యే జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించాలని సీఎస్ రామకృష్ణారావుకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, క్షేత్రస్థాయిలో అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. "రెండు రోజుల్లో ఎంత వర్షపాతం వస్తుంది.. దానిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై మనకు మాన్యువల్స్ ఉన్నాయి. కానీ, వాతావరణ మార్పులతో రెండు గంటల్లోనే రెండు నెలల వర్షపాతం కురుస్తోంది. క్లౌడ్ బర్స్ట్‌తో ఊహించనంత నష్టం వాటిల్లుతోంది. ఈ పరిస్థితులను ఎదుర్కొనే వ్యూహాలను సిద్ధం చేసుకోవాలి. ఊహించనంత వర్షపాతం కారణంగానే గతంలో ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ప్రాణ నష్టంతోపాటు భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. అటువంటి ఘటనలు ఎట్టి పరిస్థితుల్లో పునరావృతం కావడానికి వీల్లేదు" అని నిర్దేశించారు. ఒకవేళ, పిడుగుపాటుతో పశువులు, గొర్రెలు, మేకలు చనిపోతే ఎఫ్ఐఆర్ నమోదు చేయించి బాధితులకు పరిహారం అందేలా చూడాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు.

తరువాయి 2 లో

## చందానగర్ లో 'ఖజానా'ను కొల్లగొట్టిన ముసుగు దొంగలు



» 3లో

## సంజయ్.. సారీ చెప్పండి!

- బండి సంజయ్‌కి కేటీఆర్ లీగల్ నోటీసు
- 'ట్యాపింగ్'లో నాపై నిరాధార ఆరోపణలు
- మీ వ్యాఖ్యలతో నా పరువుకు భంగం
- వారంలో క్షమాపణ చెప్పకపోతే చర్యలు: కేటీఆర్
- లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసు పంపించారు. ఫోన్ ట్యాపింగ్‌కు తానే బాధ్యుడినంటూ సంజయ్ తనపై నిరాధార ఆరోపణలు చేశారని, దాంతో తన పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగిందని పేర్కొన్నారు.

» 2లో

# వరంగల్.. అతలాకుతలం!

- వరంగల్ నగరంలో ఇంట్లోకి చొచ్చుకొచ్చిన వరద నీటిలో మునిగి ఓ వృద్ధురాలు మృతి
- జనగామ పెద్దవాగులో కొట్టుకొచ్చిన మృతదేహం
- నేడు, రేపు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు



ఈ కబురు: ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షంతో ఓరుగల్లు అతలాకుతలమైంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత మొదలైన వానతో వరద ఉప్పొంగి లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాకపోకలు నిలిచిపోయి.. జనజీవనం స్తంభించింది. ఇళ్లలో నిత్యావసరాలు, సామగ్రి తడిసిపోయాయి. వరంగల్ నగరంలోని కాశికుంట వాంబే కాలనీలో ఇంట్లోకి చొచ్చుకువచ్చిన వరద నీటిలో మునిగి.. పసునూటి బుచ్చమ్మ అనే వృద్ధురాలు మృతి చెందారు. సోమవారం అర్ధరాత్రి మొదలైన కుంభ వృష్టి సుమారు మూడు గంటల పాటు కొనసాగింది. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు చెరువుల్లా మారాయి. వరద అంతకంతకూ

తరువాయి 2 లో

## భారత్‌పై సుంకాలు.. రష్యాకు పెద్ద దెబ్బ



» 2లో

## ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వ నిర్లక్ష్యం



» 2లో

## ఉద్యోగాల భర్తీపై మంత్రి ఉత్తమ్ కీలక హామీ



## ఓట్ల చోరీపై..సినిమా ఇంకా ఉంది

- ఒక వ్యక్తికి ఒక ఓటు' విధానం రాజ్యాంగానికి మూలస్తంభం
- ఈసీ అమలు చేయడం లేదు
- అందుకే మేం రాజ్యాంగ రక్షణకు పోరాడుతున్నాం: రాహుల్ గాంధీ
- లోక్‌సభను రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి: అభిషేక్ బెనర్జీ



న్యూఢిల్లీ, ఆగస్టు 12: ఎన్నికల కమిషన్ (ఈసీ)పై ఓట్ల చోరీ ఆరోపణలను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మరింత తీవ్రతరం చేశారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు' అనేది రాజ్యాంగానికి మూల స్తంభమని.. ఈ వ్యవహారంలో ఈసీ తన విధి నిర్వర్తించడం లేదని ధ్వజమెత్తారు. సోమవారం ఈసీ ప్రధాన కార్యాలయానికి పాదయాత్రగా బయల్దేరిన ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. మంగళవారం పార్లమెంటు ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'సినిమా ఇంకా ఉంది (పిక్చర్ అభీ బాకీ హై)' అని హెచ్చరించారు. కేవలం ఒక్క నియోజకవర్గంలోనే ఓట్ల చోరీ జరుగలేదని.. చాలా ఓట్ల ఇలా జరిగిందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో ఓ పద్ధతి ప్రకారం చేశారని..

తరువాయి 2లో

## నెలాఖరులోపు స్వాతంత్ర్య యోధుల పింఛన్ కేసులు పరిష్కరించండి

- నెలాఖరులోపు స్వాతంత్ర్య యోధుల పింఛన్ కేసులు పరిష్కరించండి
- అధికారులకు బండి సంజయ్ ఆదేశం



న్యూఢిల్లీ, ఈ కబురు: ఈ నెలాఖరులోగా స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్ కేసులు పరిష్కరించాలని అధికారులను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదేశించారు. దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎనిమీ ప్రాపర్టీ సమస్యల పరిష్కారానికి చేపట్టిన సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటి వరకు ఎనిమీ ప్రాపర్టీస్ విక్రయాలతో సర్కారుకు రూ.107 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

తరువాయి 2లో

మొదటి పేజీ తరువాయి

# బీ అలర్ట్!



వారిని అప్రమత్తం చేయాలి. పశు నష్టం జరగకుండా చూడాలి'' అని సూచించారు. అధిక వర్షపాతం నమోదయ్యే జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించాలని సీఎస్ రామకృష్ణారావుకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, క్షేత్రస్థాయిలో అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ''రెండు రోజుల్లో ఎంత వర్షపాతం వస్తుంది.. దానిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై మనకు మాన్యువల్స్ ఉన్నాయి. కానీ, వాతావరణ మార్పులతో రెండు గంటల్లోనే రెండు నెలల వర్షపాతం కురుస్తోంది. క్లౌడ్ బర్స్టతో ఊహించనంత నష్టం వాటిల్లుతోంది. ఈ పరిస్థితులను ఎదుర్కొనే వ్యూహాలను సిద్ధం చేసుకోవాలి. ఊహించనంత వర్షపాతం కారణంగానే గతంలో ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ప్రాణ నష్టంతోపాటు భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. అటువంటి ఘటనలు ఎట్టి పరిస్థితుల్లో పునరావృతం కావడానికి వీల్లేదు'' అని నిర్దేశించారు. ఒకవేళ, పిడుగుపాటుతో పశువులు, గొర్రెలు, మేకలు చనిపోతే ఎఫ్ఐఆర్ నమోదు చేయించి బాధితులకు పరిహారం అందేలా చూడాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు.

**లోతట్టు ప్రాంతాల ప్రజలను హెచ్చరించాలి**

ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి వచ్చే వరద నీటిపై అవగాహనతో ఉండాలని, నీటి విడుదలపై పూర్తి సమాచారం లోతట్టు ప్రాంతాల ప్రజలకు తెలియజేయాలని నీటి పారుదల శాఖ అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలను సహాయ శిబిరాలకు తరలించాలని, వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. చెరువులు, కుంటల కట్టలు తెగే ప్రమాదం ఉన్నందున ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, అత్యవసర సమయంలో వినియోగించేందుకు వీలుగా మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు, స్తంభాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పీహెచ్‌సీల్లో అత్యవసర మందులు సిద్ధం చేసి పెట్టుకోవాలన్నారు. గర్భిణులను తక్షణమే తరలించేలా అంబులెన్సులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు.

**హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

భారీ వర్షాల నేపథ్యంలో నగరంపై కీలక శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు సమన్వయంతో పని చేయాలని సీఎం రేవంత్ సూచించారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, పోలీసు, పురపాలక, విద్యుత్తు, విపత్తుల నిర్వహణ.. ఇలా అన్ని శాఖలూ సమన్వయంతో ముందుకు సాగాలని చెప్పారు. వర్షాల తీవ్రతపై విద్య, ఐటీ శాఖ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు సమీక్ష చేసుకుని అవసరమైతే పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని, ఐటీ కంపెనీలతో మాట్లాడి ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని హైడ్రాకు సూచించారు. అత్యవసర సమాచారాన్ని ఎఫ్ఎం రేడియో ద్వారా కూడా ప్రజలకు చేరవేయాలని తెలిపారు. వాతావరణ హెచ్చరికలను ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేయాలని, అదే సమయంలో మీడియా చానళ్లు ప్రజల్లో భయానక వాతావరణం సృష్టించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీఎస్, డీజీపీ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఆధార్‌ను పౌరసత్వానికి
## రుజువుగా పరిగణించలేము: సుప్రీంకోర్టు



ఈ కబురు: ఆధార్ కార్డును పౌరసత్వానికి రుజువుగా స్వీకరించలేమనే ఎన్నికల సంఘం విధానాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. బిహార్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్‌పై నమోదైన పిటిషన్లపై విచారణ జరిపిన అత్యున్నతన న్యాయస్థానం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఆధార్‌ను పౌరసత్వానికి నిదర్శనంగా స్వీకరించలేమనే ఈసీ వాదన సరైనదే. ఈ వివరాలను వెరిఫై చేసుకోవాల్సి ఉంటుంది' అని జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం తెలిపింది. అసలు పౌరసత్వాన్ని నిర్ధారించే హక్కు ఈసీకి ఉన్నదా అని పిటిషనర్ తరఫు న్యాయవాది కపిల్ సిబల్ వేసిన ప్రశ్నపై కూడా జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. 'వాళ్లకు ఆ అధికారం లేకపోతే అంతా ముగిసిపోతుంది. కానీ వాళ్లకు ఆ అధికారం ఉంటే అసలు సమస్యే లేదు కదా' అని ఆయన అన్నారు. అలాగే ఎస్ఐఆర్ ద్వారా 65 లక్షల మంది ఓటర్లను తొలగించారని, సంప్రదాయంగా కాంగ్రెస్ ఓటర్లయిన అట్టడుగు వర్గం ప్రజలను ఈ జాబితా నుంచి తొలగిస్తున్నారని సిబల్ వాదించారు. మరో అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్ కూడా సిబల్ వాదనను బలపరిచారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన వారి వివరాలను ఈసీ ఎక్కడా వెల్లడించలేదని ఆయన ఆరోపించారు. ఈ వివరాలను బూత్ లెవెల్ ఏజెంట్లకు ఇచ్చామని, ఇంకెవరికీ ఇవ్వాల్సిన అవసరం తమకు లేదని ఈసీ అంటోందని చెప్పారు. ఓటర్ తన పత్రాలను సమర్పించినప్పుడు వాటిని ధ్రువీకరించాల్సిన బాధ్యత ఈసీకి ఉంటుందని, అలాగే జాబితా నుంచి తొలగించిన వారికి సమాచారం అందించారా? అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అదే సమయంలో ఒకవేళ ఎస్ఐఆర్ ప్రక్రియ అక్రమంగా జరిగిందని భావిస్తూ సెప్టెంబరులోపు దాన్ని పక్కన పెట్టేసే అవకాశం ఉందని సుప్రీంకోర్టు తెలిపింది.

మొదటి పేజీ తరువాయి

# అదానీలపై మోదీ సర్కారు ప్రేమ



ఈ కబురు,న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ సర్కారు అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన దగ్గరి బంధువు సాగర్ అదానీలపై అలవిమాలిన ప్రేమ చూపిస్తోందని అమెరికా స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ కమిషన్ (ఎస్ఈసీ) పరోక్షంగా ఆరోపించింది. ఆంధ్రప్రదేశ్‌తో సహా కొన్ని రాష్ట్రాల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం వీరు ముడుపులు చెల్లించినట్టు వచ్చిన ఆరోపణలపై ఈ ఏడాది ఫిబ్రవరిలో తాము జారీ చేసిన సమన్లను.. మోదీ సర్కారు ఇప్పటికీ వారికి అందజేయలేదని న్యూయార్క్‌లోని ఈస్ట్రన్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి జేమ్స్ ఆర్ చో కి ఎస్ఈసీ తెలిపింది. గత ఏడాది నవంబరులో అదానీలపై తాము నమోదు చేసిన కేసుకు సంబంధించిన సమన్లను భారత్‌లో ఉంటున్న అదానీలకు అందజేయాలంటే భారత ప్రభుత్వ సహాయం తప్పనిసరని పేర్కొంది. వీరికి సమన్లు అందజేయమని ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి భారత ప్రభుత్వ న్యాయ మంత్రిత్వ శాఖను కోరుతున్నా ఇప్పటి వరకు ఉలుకూపలుకు లేదని ఎస్ఈసీ కోర్టుకు తెలిపింది.

మొదటి పేజీ తరువాయి

# వరంగల్.. అతలాకుతలం!

పసునూటి బుచ్చమ్మ అనే వృద్ధురాలు మృతి చెందారు. సోమవారం అర్ధరాత్రి మొదలైన కుంభ వృష్టి సుమారు మూడు గంటల పాటు కొనసాగింది. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు చెరువుల్లా మారాయి. వరద అంతకంతకూ పెరిగిపోతుండటంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. అంతా ఇంటి డాబాలపైకి ఎక్కారు. గుడిసెలు, రేకుల ఇళ్లలోని వారు వరద మొదలవగానే ఇళ్లు విడిచి ఎత్తయిన ప్రాంతాలకు వెళ్లిపోయారు. సహాయక చర్యలు చేపట్టిన విపత్తు నిర్వహణ సిబ్బంది వందలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరద బాధితుల కోసం ఐదు చోట్ల శిబిరాలు ఏర్పాటు చేశారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లోకి భారీగా వరద చేరి పట్టాలు మునిగిపోయాయి. తర్వాత మెల్లగా వరద తగ్గడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలగలేదు. మరోవైపు భారీ వర్షాలతో ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలతోపాటు పలు ప్రాంతాల్లో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో చిలుకల వాగు ఉధృతితో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సంగారెడ్డి జిల్లాలో వందల ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సింగరేణి ఓపెన్ కాస్టుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఇక హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాలు నిండిపోవడంతో గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దీనితో హైదరాబాద్ నగరం పరిధిలో మూసీ నదిలో వరద పెరిగింది. ముందుజాగ్రత్తగా ముసారాంబాగ్ బ్రిడ్జిని తాత్కాలికంగా మూసివేశారు. కాగా, వరంగల్ జిల్లాలో భారీ వర్షాలకు ఆకేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఇక్కడి పర్వతగిరి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పశువుల కాపరి కందికట్ల ఉప్పలయ్య (65) ఆకేరు వరదలో గల్లంతయ్యారు. సంగారెడ్డి జిల్లా యూసుఫ్‌పూర్ శివారులోని బ్రిడ్జిని దాటుతుండగా శ్రీనివాస్ అనే వ్యక్తి నీటి ఉధృతిలో కొట్టుకుపోయారు. మరోవైపు జనగామ జిల్లా రఘునాథపల్లి రైల్వే ట్రాక్ సమీపంలోని పెద్దవాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. ఆ మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు.. అతడికి సుమారు 4045 ఏళ్ల వయసు ఉంటుందని తెలిపారు.

**5 జిల్లాల్లో స్కూళ్లకు సెలవు**

భారీ వర్షాల నేపథ్యంలో.. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, భువనగిరి జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు విద్యాశాఖ బుధ, గురువారాలు సెలవు ప్రకటించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉదయం పూట మాత్రమే పాఠశాలలు నిర్వహించాలని సూచించింది.

**మంచంపై నిద్రపోయి.. అలాగే నీట మునిగి..**

భారీ వర్షంతో వరంగల్‌లోని కాశికుంట వాంబే కాలనీలో ఒక్కసారిగా వరద పోటెత్తింది. ఆ వరద ఇంట్లోకి చొచ్చుకురావడంతో మంచంపై నిద్రిస్తున్న మానసిక వికలాంగురాలు పసునూటి బుచ్చమ్మ (80) అలాగే నీట మునిగి మృతిచెందారు. ఆమె కుమారుడు గతంలోనే మరణించడంతో.. కోడలు కళావతి, మనవరాలు కృపతో కలిసి ఉంటున్నారు. ఆమె మృతితో వారు విషాదంలో మునిగిపోయారు.

**నేడు, రేపు అతిభారీ వర్షాలు**

బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో బుధ, గురు వారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లోని కొన్ని మండలాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ఖమ్మం జిల్లాలోని మధిర, ఎర్రుపాలెం మండలాల్లో అతిభారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో మోస్తరు వానలు పడతాయని తెలిపింది గురువారం ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో కొన్ని మండలాల్లో 20 సెంటీమీటర్లకుపైగా, మిగతా చోట్ల 1120 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. సంగారెడ్డి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోనూ భారీ వర్షం పడుతుందని పేర్కొంది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం.. వరంగల్ జిల్లా సంగెంలో అత్యధికంగా 20 సెంటీమీటర్ల వాన పడిందని, సూర్యాపేట జిల్లా నాగారంలో 18.7, తిరుమలగిరిలో 18, వరంగల్ జిల్లా ఖిలావరంగల్‌లో 15.7, సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో 13.2, వర్ధన్నపేటలో 12.8, జనగామ జిల్లా కొడకండ్లలో 12.3, సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెంలో 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది.

**వానొస్తే బడి సంద్రమే!**

సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలోని కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులను అధికారులు ట్రాక్టర్‌లో బయటికి తీసుకువస్తున్న దృశ్యమిది. ఇందులో 240మంది విద్యార్థినులు చదువుతున్నారు. సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి పాఠశాల చుట్టూ భారీగా నీరు చేరింది. దీనితో అధికారులు సెలవు ప్రకటించి విద్యార్థినులను వారి ఇళ్లకు పంపారు.

**అంబులెన్సు రాలేక.. మంచంలో**

భారీ వర్షంతో వరంగల్ జిల్లా సంగెం మండలం ఎల్గూరు రంగంపేట వెళ్లే దారిలోని రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు చేరింది. గ్రామానికి చెందిన వడ్లకొండ పరమేశ్వర్‌కు మంగళవారం ఉదయం గుండెపోటు వచ్చింది. అంబులెన్సు గ్రామంలోకి వచ్చే పరిస్థితి లేకపోవడంతో.. కుటుంబ సభ్యులు ఆయనను మంచంపై మోసుకుంటూ రైల్వే ట్రాక్ దాటివచ్చి అంబులెన్సులో ఎక్కించారు. హైదరాబాద్ సిటీ, ఈ కబురు: భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని చెప్పారు. ఐటీ ఉద్యోగులకు ఇంటి నుంచే పనిచేసే (వర్క్ ఫ్రం హోం) అవకాశం కల్పించాలని కంపెనీలను, ప్రభుత్వాన్ని కోరారు. వరద నీరు, ఇతర కారణాలతో ఏర్పడే ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు ప్రజలు వీలైనంత వరకు రెండు రోజుల పాటు వాహనాలు బయటికి తీయవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాలవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డీఆర్ఎఫ్ హెల్ప్ లైన్ నంబర్లు 04029560521, 90001 13667, 91541 70992, జీహెచ్ఎంసీ కాల్ సెంటర్ 040 21111111కు కాల్ చేసి సంప్రదించాలని సూచించారు.



# ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు
## పౌరసత్వాన్ని నిరూపించవు



ఈ కబురు:ఆధార్, పాన్, ఓటర్ ఐడీలు సదరు వ వ్యక్తుల పౌరసత్వాన్ని నిరూపించవని, అవి కేవలం గుర్తింపు కార్డులేనని బాంబే హైకోర్టు తేల్చిచెప్పింది. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లో ప్రవేశించాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న బాబూ అబ్దుల్ రూఫ్ సర్దార్‌కు బెయిల్ ఇచ్చేందుకు జస్టిస్ అమిత్ బోర్కార్ ధర్మాసనం నిరాకరించింది. రాజ్యాంగంలోని సిటిజన్‌షిప్ చట్టం ప్రకారం మాత్రమే పౌరుల పౌరసత్వాన్ని నిర్ణయించగలమని, అంతేకానీ ఆధార్, పాన్, ఓటర్ ఐడీలతో కాదని ధర్మాసనం పేర్కొంది .ఈ కార్డులు గుర్తింపు కోసం, అలాగే ప్రభుత్వ సేవల లబ్ధి పొందేందుక మాత్రమే ఉపయోగపడతాయని తెలిపింది. అబ్దుల్ సర్దార్ అక్రమంగా భారత్‌లో ప్రవేశించడమే కాకుండా ఆధార్, పాన్, ఓటర్, భారత పాస్ పోర్టు తదితర నకిలీ ధ్రువపత్రాలను కూడా పొందాడని పోలీసులు చెప్తున్నారు. అతనికి బెయిల్ ఇస్తే పారిపోయే ప్రమాదం ఉందన్న వారి వాదనతో కోర్టు కూడా ఏకీభవించింది. 'పౌరసత్వాన్ని 1955 సిటిజన్‌షిప్ చట్టం ప్రకారమే నిర్ధారించాలి. కేవలం ఆధార్, పాన్, ఓటర్ ఐడీలు ఏంటే వాళ్లు భారత పౌరులు అయిపోరు' అని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది

# సంజయ్.. సారీ చెప్పండి!

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఈ కబురు: కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసు పంపించారు. ఫోన్ ట్యాపింగ్‌కు తానే బాధ్యుడినంటూ సంజయ్ తనపై నిరాధార ఆరోపణలు చేశారని, దాంతో తన పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగిందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఏడు రోజుల్లోగా తనకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, భవిష్యత్తులో తనపై, తన కుటుంబ సభ్యులపై నిరాధార ఆరోపణలు చేయకుండా ఉండాలని బండి సంజయ్‌కి సూచించారు. లేదంటే ఆయనపై చట్టపరంగా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అయితే లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని బండి సంజయ్ అన్నారు. కేటీఆర్ పంపిన నోటీసులపై 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. ''ఆట మొదలైంది. లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదు. నిజం ఒక సింహం.. దానిని విడిచిపెడితే అది తనను తాను రక్షించుకుంటుంది. ఫోన్ ట్యాపింగ్ ద్వారా జీవితాలను నాశనం చేసిన నేరస్తులు బయటపడతారు. సత్యమేవ జయతే'' అని సంజయ్ పోస్ట్ చేశారు.






# 9 పార్టీలకు ఈసీ నోటీసులు

**25 లోపు జవాబివ్వాలి**
**కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి నోటీసులు**

హైదరాబాద్, ఈ కబురు: లోక్‌సత్తాతోపాటు గుర్తింపు లేని 8 రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్‌ను ఎందుకు రద్దు చేయకూడదో తెలియజేయాలని ఆ పార్టీలకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) సి.సుదర్శన్‌రెడ్డి నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు ఈ నెల 25 లోపు సమాధానం ఇవ్వడంతోపాటు సరైన ఆధారాలు సమర్పించాలని మంగళవారం జారీ చేసిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఈసీ నోటీసులు అందుకున్న పార్టీల్లో ఆల్ ఇండియా ఆజాద్ కాంగ్రెస్ పార్టీ (హైదరాబాద్), ఆల్ ఇండియా బీసీ ఓబీసీ పార్టీ (మేడ్చల్ మల్కాజ్‌గిరి), బీసీ భారతదేశం పార్టీ (హైదరాబాద్), భారత లేబర్ ప్రజా పార్టీ (భద్రాద్రికొత్తగూడెం), లోకసత్తా పార్టీ (హైదరాబాద్), మహాజన మండలి పార్టీ (హైదరాబాద్), నవ భారత్ నేషనల్ పార్టీ (మేడ్చల్ మల్కాజ్‌గిరి), తెలంగాణ ప్రగతి సమితి (మేడ్చల్‌మల్కాజ్‌గిరి), తెలంగాణ ఇండిపెండెంట్ పార్టీ (మేడ్చల్ మల్కాజ్‌గిరి) ఉన్నాయి. హైదరాబాద్, మెదక్, మేడ్చల్‌మల్కాజిగిరి, భద్రాద్రికొత్తగూడెం) జిల్లాల కలెక్టర్లకు ఈ నోటీసులను పంపిన సీఈఓ.. సదరు పార్టీల పేర్లను దిన పత్రికలు, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచురించి ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు.

# ఓట్ల చోరీపై..సినిమా ఇంకా ఉంది



సినిమా ఇంకా ఉంది (పిక్చర్ అభీ బాకీ హై)' అని హెచ్చరించారు. కేవలం ఒక్క నియోజకవర్గంలోనే ఓట్ల చోరీ జరుగలేదని.. చాలా ఓట్లు ఇలా జరిగిందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో ఓ పద్ధతి ప్రకారం చేశారని.. ఇది ఈసీతో పాటు తమకూ తెలుసని చెప్పారు. 'గతంలో ఇందుకు ఆధారాల్లేవు. ఇప్పుడు సాక్ష్యాలు ఉన్నాయి. ఒక వ్యక్తికి ఒకే ఓటు అనేది రాజ్యాంగ మూలస్తంభం. దానిని అమలుచేయాల్సిన ఈసీ ఆ పనిచేయడం లేదు. అందుచేత మేం రాజ్యాంగ రక్షణకు పూనుకున్నాం. దీనిని కొనసాగిస్తాం' అని స్పష్టంచేశారు. బిహార్ ఓటర్ల జాబితాలో మింతా దేవి అనే మహిళ వయసును 124 ఏళ్లుగా ఈసీ పేర్కొనటమే గాక, ఆమె తొలిసారి ఓటుహక్కు పొందినట్లుగా చెప్పడాన్ని ప్రస్తావించారు. ఇలాంటి తప్పుడు కేసులు అనేకం ఉన్నాయన్నారు. అంతకుముందు.. బిహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణపై పార్లమెంటులో చర్చించాలంటూ ఇండీ కూటమి ఎంపీలు పార్లమెంటు భవన సముదాయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. వారంతా మింతాదేవి ఫొటో, పేరు ముద్రించిన టీ షర్టులు ధరించారు. ఈ నిరసనలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీపీపీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రాతో పాటు డెరిక్ ఒబ్రియాన్ (టీఎంసీ), టీఆర్ బాలు (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్‌సీపీఎస్‌పీ). వామపక్షాల ఎంపీలు పాల్గొన్నారు. రాజీవ్‌కుమార్, జ్ఞానేశ్‌కుమార్ సారథ్యంలో ఈసీ బీజేపీ విభాగంగా మారిపోయిందని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ ఆరోపించారు.కుట్రపన్నడమే బీజేపీ నైజం: అఖిలేశ్ఎన్నికల అక్రమాలకు కుట్రలు పన్నడమే బీజేపీ చేసే అతి పెద్ద పని అని సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. ఎన్నికలను ప్రభావితం చేయడానికే బిహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) చేపట్టారని అన్నారు. ఏడాది కిందట చేపట్టాల్సిన ఈ సవరణ ప్రక్రియను.. ప్రతిపక్షాల ఓట్లను తొలగించడానికి ఉద్దేశపూర్వకంగా ఇప్పుడు చేపట్టారని విమర్శించారు. ఎన్నికల కమిషన్ తనకున్న రాజ్యాంగ ప్రతిపత్తిని దుర్వినియోగం చేస్తోందని ఆర్‌జేడీ నేత, బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. ఓటర్ల ప్రత్యేక సవరణను ఆయన మంగళవారం పట్నాలో తప్పుబట్టారు.ఓటర్ల జాబితాల్లో అవకతవకలు ఉన్నాయని ఈసీ భావిస్తే.. మొదట ప్రధాని మోదీ, ఆయన మంత్రివర్గం రాజీనామా చేయాలని టీఎంసీ లోక్‌సభాపక్ష నేత అభిషేక్ బెనర్జీ డిమాండ్ చేశారు. లోక్‌సభను రద్దుచేయాలన్నారు. ఎంపిక చేసిన రాష్ట్రాల్లో కాకుండా దేశవ్యాప్తంగా 'సర్' చేపట్టాలని స్పష్టంచేశారు. బిహార్, బెంగాల్లో ఓటర్ల హక్కులను అణచివేసేందుకే తాజాగా సవరణ చేపట్టారని కోల్‌కతాలో ఆరోపించారు. గుజరాత్, యూపీ, మధ్యప్రదేశ్, తమిళనాడుల్లో ఎందుకు చేపట్టలేదని నిలదీశారు.'ఓటు చౌర్యం'పై కాంగ్రెస్ పార్టీ ఈ నెల 14న దేశవ్యాప్తంగా 'లోక్ తంత్ర బచావో' పేరుతో కాగడ ర్యాలీలకు పిలుపునిచ్చింది. అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఈ అంశంపై మంగళవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, జైరామ్ రమేశ్, కేసీ వేణుగోపాల్, సచిన్ పైలట్, భన్వర్ జితేంద్ర సింగ్, గులాం అహ్మద్ మిర్, అజయ్ మాకెన్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఎన్ఎస్‌యూఐ నేత కన్హయ్యకుమార్ ఇండీ కూటమి భవిష్యత్ కార్యాచరణ వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 14న 'లోక్ తంత్ర బచావో మశాల్ మార్చ్', 22 నుంచి సెప్టెంబరు 7 వరకు అన్ని రాష్ట్రాల రాజధానుల్లో 'ఓటు దొంగలు.. అధికారపీఠాన్ని వదిలేయండి' నినాదంతో ర్యాలీలు, సెప్టెంబరు 15 నుంచి నెలరోజుల పాటు ఓటు హక్కు రక్షణ కోసం సంతకాల సేకరణ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ పోరాటంలో ఇండీ కూటమి సమష్టిగా పనిచేస్తుందని చెప్పారు. అంతకు ముందు రాహుల్‌గాంధీ మాట్లాడుతూ కర్ణాటకలోని మహాదేవపుర నియోజకవర్గం వంటి వాటిని పరిగణనలోకి తీసుకుంటే.. ఓట్ల చౌర్యంతో కాంగ్రెస్ 48 లోక్‌సభ స్థానాలను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# భారత్‌పై సుంకాలు..
## రష్యాకు పెద్ద దెబ్బ

వాషింగ్టన్,ఈ కబురు: రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో భారత్‌పై విధించిన టారిఫ్‌లతో రష్యాకు పెద్ద దెబ్బ తగిలిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుతం రష్యా ఆర్థిక వ్యవస్థ క్షీణదశలో ఉందని వ్యాఖ్యానించారు. సోమవారం (అమెరికా కాలమానం ప్రకారం) ఆయన వైట్‌హౌజ్‌లో మీడియాతో మాట్లాడారు. ''రష్యా ఒక పెద్ద దేశం. ఎంతో పురోగమించే సామర్థ్యం దానికి ఉంది. ఆ దేశం పునర్నిర్మాణంపై దృష్టిసారించుకోవాల్సి ఉంది. ఇప్పుడైతే రష్యా పరిస్థితి ఏమీ బాగోలేదు. అమెరికా ఆంక్షలే దానికి కారణం. రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై 50శాతం సుంకాలు విధించాం. అది రష్యాకు పెద్ద దెబ్బ..'' అని ట్రంప్ పేర్కొన్నారు. శుక్రవారం అలాస్కాలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం కానున్నట్టు తెలిపారు. రష్యాలోనో, మరో దేశంలోనో కలవకుండా.. అమెరికాలో తమ భేటీ జరగనుండటం గౌరవనీయమని పేర్కొన్నారు. తమ భేటీ తర్వాత యూరోపియన్ దేశాల నేతలతో మాట్లాడుతానని.. పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య చర్చలు జరిగేలా చూస్తానని తెలిపారు.

**చైనాపై టారిఫ్‌లు 3 నెలలు వాయిదా**

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై 50 శాతం సుంకాలు విధించి, అందులో 25శాతాన్ని అమల్లోకి తెచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. భారత్‌కన్నా ఎక్కువగా రష్యా చమురు కొంటున్న చైనా విషయంలో మాత్రం మినహాయింపులు పెంచుకుంటూ వెళుతున్నారు. చైనాపై సుంకాలకు ఇచ్చిన మినహాయింపు గడువును మరో మూడు నెలలు అంటే నవంబర్ 10వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**అలాస్కా.. రష్యాలో.. నోరుజారిన ట్రంప్!**

అమెరికాలో వాయవ్య ప్రాంతంలో ఉన్న కీలక ప్రాంతం అలాస్కా. శుక్రవారం అక్కడే ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ జరగనుంది. ట్రంప్ ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. 'పుతిన్‌తో చర్చల కోసం రష్యా వెళుతున్నా..' అంటూ నోరుజారారు. దీనితో అమెరికాలో భాగమైన అలాస్కాను రష్యాగా పేర్కొనడం ఏమిటంటూ ట్రోలింగ్ జరుగుతోంది.



మొదటి పేజీ తరువాయి

# అమెరికాలో రోడ్డు ప్రమాదం హైదరాబాద్ యువతి దుర్మరణం



**ఉన్నత విద్య కోసం హైదరాబాద్ నుంచి అమెరికా వెళ్లిన ఓ యువతి అక్కడ జరిగిన రోడ్డు..**

**రోడ్డుపై నడిచి వెళుతుండగా ఢీకొట్టిన ట్రక్కు**

దుండిగల్, సిద్దిపేట రూరల్,ఈ కబురు: ఉన్నత విద్య కోసం హైదరాబాద్ నుంచి అమెరికా వెళ్లిన ఓ యువతి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించింది. సిద్దిపేట జిల్లా రావురూకలకు చెందిన లక్కర్సు శ్రీనివాస్ వర్మ, హేమలత దంపతులకు శ్రీజవర్మ(23), శ్రియ వర్మ కుమార్తెలున్నారు. 16 ఏళ్ల క్రితం హైదరాబాద్ వచ్చిన ఈ కుటుంబం గండిమైసమ్మలోని బాలాజీనగర్‌లో ప్రస్తుతం నివాసముంటోంది. శ్రీనివాస్ బొరంపేటలోని ఓక్రిడ్జ్ పాఠశాలలో ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌చార్జిగా పనిచేస్తుండగా హేమలత ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నారు. ఇక, దుండిగల్‌లోని ఏరోనాటికల్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన శ్రీజ వర్మ ఎంఎస్ చదివేందుకు మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. అక్కడ చదువు పూర్తి చేసుకున్న శ్రీజ.. ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నారు. స్నేహితులతో కలిసి షికాగోలో నివాసముంటున్న శ్రీజ వర్మ.. సోమవారం రాత్రి తొమ్మిది గంటలప్పుడు(అమెరికా కాలమాన ప్రకారం) స్నేహితురాలితో కలిసి రెస్టారెంట్‌కు నడిచి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఓ ట్రక్కు ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఎప్పట్లాగే శ్రీనివాస్ వర్మ.. మంగళవారం ఉదయం శ్రీజకు ఫోన్ చేయగా ఆమె స్పందించలేదు. దీంతో శ్రీజ స్నేహితులకు ఫోన్ చేయగా కుమార్తె మరణవార్త తెలిసింది. కూతురి హఠాన్మరణంతో శ్రీనివాస్ వర్మ దంపతులు తీవ్ర శోకంలో మునిగిపోయారు. కాగా, శ్రీజ వర్మ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు సాయం చేయాలని శ్రీనివాస్ వర్మ దంపతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వ నిర్లక్ష్యం



## 'చలో గాంధీభవన్'లో నిరుద్యోగుల నిరసన

నాంపల్లి, ఈ కబురు: 'గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మా మద్దతు అడిగిన కాంగ్రెస్ నాయకులు, సీఎం రేవంత్‌రెడ్డి... నేడు మా ఆవేదన వినడానికి కూడా సమయం కేటాయించడం లేదు' అని నిరుద్యోగులు, నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు నిరసన వ్యక్తంచేశారు. వారు మంగళవారం 'చలో గాంధీభవన్' చేపట్టారు. దాని ముట్టడికి విఫలయత్నం చేశారు. ఈ సందర్భంగా స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. నిరుద్యోగులు గాంధీభవన్ ముట్టడికి పిలుపునివ్వడంతో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. కొందరు నిరుద్యోగులను అదుపులోకి తీసుకొని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించి.. సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు పాలకూరి అశోక్‌కుమార్, ఇంద్రనాయక్, జనార్దన్, సింధూరెడ్డి, ఆస్మా బేగం, కుమార్, రవికుమార్ తదితరులు మాట్లాడుతూ జాబ్ క్యాలండర్‌ను ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. పోలీసు, టీచర్ ఉద్యోగాలతో పాటు గ్రూప్1, 2, 3 నోటిఫికేషన్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

మొదటి పేజీ తరువాయి

# చందానగర్ లో 'ఖజానా'ను కొల్లగొట్టిన ముసుగు దొంగలు



ముసుగులు ధరించి షోరూం లోపలికి ప్రవేశిస్తున్న దుండగులు



దోపిడీ అనంతరం ద్విచక్ర వాహనాలపై పారిపోతున్న దుండగులు



షో రూమ్ లోపల ఆభరణాలను బ్యాగుల్లో నింపుతున్న దృశ్యం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అవినాష్ మహంతి



దుండగుల కాల్పుల్లో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డిప్యూటీ మేనేజర్

- **తుపాకులతో కాల్పులు జరిపి దోపిడీకి పాల్పడిన ఆరుగురు దుండగులు**
- **ఖజానా జ్యువెలర్స్ డిప్యూటీ మేనేజర్ కు తీవ్ర గాయాలు**
- **పది నిమిషాల్లో షోరూం లూటీ చేసి బైకులపై పరారీ**
- **పది ప్రత్యేక బృందాలతో దుండగుల కోసం వేట**

ఈకబురు, శేరిలింగంపల్లి : '' హైటెక్ సిటీలో దోపిడీ దొంగలు చెలరేగిపోయారు. అందరూ చూస్తుండగా ప్రధాన రహదారి పై ఉన్న ఓ బంగారం దుకాణాన్ని లూటీ చేసి ద్విచక్ర వాహనాలపై పరారయ్యారు. మంగళవారం ఉదయాన్నే చోటు చేసుకున్న ఈ సంఘటన నగరాన్ని ఉలిక్కి పడేలా చేసింది. ముసుగులు ధరించిన ఆరుగురు దుండగులు పిస్తోళ్లు, ఆయుధాలతో చందానగర్ ఖజానా జ్యువెలర్స్ లోకి ప్రవేశించి దోపిడీకి పాల్పడ్డారు. దోపిడీ సమయంలో దుండగులు ఖజానా జ్యువెలర్స్ అసిస్టెంట్ మేనేజర్ మీద కాల్పులు జరపగా, గాయపడిన క్షతగాత్రుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉదయం షాపు తీసిన కొద్దిసేపట్లోనే ఈ ఘటన చేసుకోవడం, అప్పటికి లాకర్ రూమ్ తాళాలు సిబ్బంది వద్ద లేకపోవడంతో భారీ నష్టం తప్పింది. వెండి ఆభరణాలు, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలతో కేవలం పది నిమిషాల్లోనే దోపిడీని ముగించి ద్విచక్ర వాహనాల్లో దుండగులు పరారయ్యారు. సంఘటనా స్థలిని సైబరాబాద్ కమిషనర్, మాదాపూర్ డిసిపిలు పరిశీలించగా పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు దుండగుల కోసం వేట ప్రారంభించారు. "" చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..చందానగర్ పరిధిలో ప్రధాన జాతీయ రహదారికి అనుకొని గంగారాంలో ఖజానా జ్యువెలరీ షాప్ ఉంది. మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో జ్యువెలరీ షాప్‌లో పనిచేసే దాదాపు 25 మంది సిబ్బందికి మీటింగ్ జరుగుతుంది. సరిగ్గా 10.35 గంటలకు కొందరూ యువకులు ముసుగులు ధరించి, గన్ లతో షాప్‌లోకి ప్రవేశించారు. వస్తూనే లోపల ఉన్న వ్యక్తులను గన్‌తో బెదిరించారు.

### డిప్యూటీ మేనేజర్ పై కాల్పులు..

షాప్ లోకి ప్రవేశిస్తూనే మీటింగ్‌లో ఉన్న షోరూమ్ డిప్యూటీ మేనేజర్ సతీష్‌ను గోల్డ్ లాకర్ తాళం కావాలని గన్‌తో బెదిరించారు. దుండగులు రెండు రౌండ్లు కాల్పులు జరిపి సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. తన వద్ద లాకర్ కీ లేదని డిప్యూటీ మేనేజర్ సతీష్ చెప్పడంతో ఓ దుండగుడు గన్‌తో సతీష్‌కుమార్‌పై కాల్పులు జరిపాడు. ఒక బుల్లెట్ సతీష్ ఎడమ కాలు తోడలోకి దూసుకువెళ్లింది. ఆ తర్వాత ముగ్గురు దుండగులు గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉండగా ముగ్గురు దుండగులు మొదటి అంతస్థులోకి వెళ్లారు. అక్కడ డిస్‌ప్లేలను పగులగొట్టి అందులో ఉన్న వెండి వస్తువులను తమ వెంట తెచ్చుకున్న బ్యాగులలో నింపుకున్నారు. అనంతరం ఒకరి తర్వాత ఒకరు జ్యువెలరీ షాప్ నుండి బయటకు వచ్చి బైకులపై అక్కడి నుండి పారిపోయారు. వెంటనే జ్యువెలరీ సిబ్బంది చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని కాల్పుల ఘటనపై వివరాలను తెలుసుకున్నారు. క్లూస్ టీమ్స్‌తో అధారాలను సేకరించారు. ఘటన స్థలాన్ని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, మాదాపూర్ డీసీపీ వినీత్, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్‌లు పరిశీలించారు. దోపిడీ, కాల్పుల ఘటనపై జ్యువెలరీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ దోపిడీపై చందానగర్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

### కీ మర్చిపోవడంతో తప్పిన భారీ నష్టం..

మంగళవారం ఉదయం ఖజానా జ్యువెలరీ షోరూమ్ ఓపెన్ చేసిన తర్వాత మేనేజర్ గోల్డ్ లాకర్ కీ మర్చిపోవడంతో తాళాలు తీసుకురావడానికి తిరిగి బయటకు వెళ్లాడని సిబ్బంది తెలిపారు. అదే సమయంలో దుండగులు షోరూమ్ లోపలికి ప్రవేశించి లాకర్ కీ కావాలని అక్కడే ఉన్న డిప్యూటీ మేనేజర్‌పై కాల్పులకు తెగబడ్డారు. ఒకవేళ మేనేజర్ షాప్‌లోనే ఉంటే అతని వద్ద లాకర్ కీ తీసుకొని లాకర్లలో ఉన్న బంగారాన్ని ఎత్తుకెళ్లేవారు. దీంతో భారీ నష్టం సంభవించేదని సిబ్బంది చెబుతున్నారు.

### ద్విచక్ర వాహనాలపై పరారీ..

ఉదయం 10.35గంటలకు 6గురు దుండగులు ఒకరి తర్వాత ఒకరు జ్యువెలరీ షాప్‌లోకి ప్రవేశించారు. ఐదుగురు మాస్కులు ధరించగా ఓ వ్యక్తి హెల్మెట్ పెట్టుకున్నాడు. ముగ్గురు వ్యక్తులు గ్రౌండ్ ఫ్లోర్ కు, మరో ముగ్గురు వ్యక్తులు ఫస్ట్ ఫ్లోర్ కు వెళ్లారు. ఫస్ట్ ఫ్లోర్ లో డిస్‌ప్లేలో ఉన్న వెండి అభరణాలను తమవెంట తెచ్చుకున్న బ్యాగుల్లో నింపుకున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న దుండగులు వన్ గ్రామ్ గోల్డ్ ను బ్యాగుల్లో నింపుకున్నారు. అనంతరం ఒకరి తర్వాత ఒకరు షాప్ నుండి 10.46 కు బయటకు వచ్చారు. రెండు బైకులపై ఆరుగురు దుండగులు చందానగర్ నుండి బీహెచ్ఈఎల్ ఫ్లైఓవర్ మీదుగా జాతీయ రహదారిపై సంగారెడ్డి వైపు పరారయ్యారు.

### దుండగుల కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు : కమిషనర్ అవినాష్ మహంతి

ఖజానా జ్యువెలరీ బంగారం షాప్‌లో దోపిడీకి పాల్పడ్డ నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన అనంతరం మీడియాలో సీపీ మాట్లాడారు. మంగళవారం ఉదయం ఆరుగురు నిందితులు మాస్క్ లు ధరించి బైకులపై వచ్చి షాప్ లోకి చొరబడ్డారని, అందులో ముగ్గరు లేదా నలుగురి వద్ద పిస్తోలు ఉన్నాయని తెలిపారు. షాప్ లోకి చొరబడిన దుండగులు ముందుగా సీసీ టీవీ కెమెరాపై కాల్పులు జరిపారని, అనంతరం లాకర్ తాళాలు ఇవ్వాలంటూ అసిస్టెంట్ మేనేజర్ సతీష్ కుమార్ పై కాల్పులు జరపడంతో అతని కాలుకు గాయాలు అయినట్లు తెలిపారు. ప్రస్తుతం సతీష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. ఘటన స్థలంలో రెండు ఖాళీ క్యాట్రిడ్జ్ లు దొరికాయని అన్నారు. దుండగులు షాప్ లో కేవలం10 నిమిషాలు మాత్రమే ఉన్నారని, స్పాట్ లో దొరికిన వెండి వస్తువులను దోచుకెళ్లారని, ఎంత మొత్తంలో చోరీ జరిగింది అనేది ఇంకా స్పష్టత రాలేదన్నారు. 10 ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని, సరిహద్దు జిల్లాల పోలీసులను అప్రమత్తం చేయడంతో పాటు టోల్ గేట్ల వద్ద కూడా ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టామన్నారు. దుండగులు అందరూ 30 ఏండ్ల వయస్సు ఉన్న యువకులేనని పోలీసులు భావిస్తున్నారు. దుండగులు షాప్ లోకి రావడం, సిబ్బందిని బెదిరించి ఆభరణాలను బ్యాగుల్లో నింపుకోవడం, షాపు నుంచి బయటపడి ద్విచక్ర వాహనాల్లో పారిపోవడం అక్కడి సీసీ కెమెరాలు రికార్డు అయింది.

మొదటి పేజీ తరువాయి

# సీబీఐ చేతికి గట్టు వామనరావు దంపతుల కేసు

ఈ కబురు, న్యూఢిల్లీ: గట్టు వామనరావు దంపతుల హత్య కేసుపై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని మంగళవారం ఆదేశించింది. ఈ క్రమంలో.. హత్య కేసును తిరిగి విచారణ జరపాలని, పిటిషనర్‌కు భద్రత కల్పించాలని సీబీఐకి సూచించింది.హైకోర్టు లాయర్లైన వామనరావు, ఆయన సతీమణి నాగమణి దంపతులను పెద్దపల్లి జిల్లా మంథనిలో 2017 ఫిబ్రవరి 17వ తేదీన రోడ్డుపైనే కొందరు దారుణంగా హతమార్చారు. ఈ జంట హత్య తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ కేసులో పలువురిని అరెస్ట్ చేయగా.. ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది. అయితే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని వామనరావు తండ్రి కిషన్ రావు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జస్టిస్ ఎంఎం సుందరేశ్ , జస్టిస్ ఎన్ కె. సింగ్‌ల ధర్మాసనం పిటిషన్‌ను విచారించి.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అలాగే హత్యకు సంబంధించిన వీడియోలు, పత్రాలు అందజేయాలని ఆదేశించింది. సీబీఐ విచారణ అవసరమా? అనే అంశంపై రికార్డులు పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తెలిపింది.ఈలోపు.. కేసును సీబీఐకి అప్పగించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది తెలిపారు. దీంతో.. సీబీఐకి కేసును బదిలీ చేస్తున్నట్లు సుప్రీం కోర్టు ఇవాళ ఆదేశాలు జారీ చేసింది.



# గచ్చిబౌలి డివిజన్ లో రూ.5.42 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**శేరిలింగంపల్లి సమగ్ర అభివృద్దే లక్ష్యం : ఎమ్మెల్యే గాంధీ**

**డివిజన్ అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నాం : కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ లో నూతనంగా చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు బుధవారం ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలో 5.42 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణం, వరద నీటి కాలువ పనులకు తెలంగాణ పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు. గుల్మోహర్ పార్క్ కాలనీలో 1.23 కోట్ల రూపాయల వ్యయంతో సీసీ రోడ్లు, లక్ష్మి విహార్ ఫేజ్ 1 కాలనీలో 85 లక్షలతో సీసీ రోడ్లు,నల్లగండ్ల హుడా కాలనీలో 58 లక్షలతో సీసీ రోడ్లు, వరద నీటి కాలువ పనులు,గోపన్‌పల్లి మంజీర డైమండ్స్ హైట్స్ లో 75 లక్షలతో సీసీ రోడ్లు, టీఎన్జీవోస్ కాలనీలో 40 లక్షలతో సీసీ రోడ్లు, నానక్ రామ్ గుడలో 35 లక్షలతో వరద నీటి కాలువ పనులు, ఖాజాగూడలో 12 లక్షలతో సీసీ రోడ్లు, రాయదుర్గంలో 1.14 కోట్లతో వరద నీటి కాలువ నీటి కాలువ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున నిధులను కేటాయిస్తుందని అన్నారు. కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ శరవేగంగా విస్తరిస్తున్న గచ్చిబౌలి డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా నిలుపుతున్నామని అన్నారు. మన నగరాభివృద్ధి మన చేతుల్లోనే ఉందని, రానున్న రోజుల్లో మౌలిక సదుపాయాల కోసం మరిన్ని నిధులు కేటాయించి, గచ్చిబౌలి డివిజన్‌లోని అన్ని ప్రాంతాలను వేగవంతంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, అభివృద్దే ధ్యేయంగా గత నాలుగు సంవత్సరాలుగా కోట్లాది రూపాయల నిధులతో గచ్చిబౌలి డివిజన్‌ను మోడ్రన్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దామని, గ్రేటర్ హైదరాబాద్ లోనే ఆదర్శవంతమైన డివిజన్‌గా మారేందుకు కృషి చేస్తానని తెలిపారు. సమస్యలను ఒక్కొకటిగా అధిగమిస్తూ శాశ్వత పరిష్కారం చూపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# నెలాఖరులోపు స్వాతంత్ర్య యోధుల పింఛన్ కేసులు పరిష్కరించండి

స్వాతంత్ర్య సమర యోధులు, పునరావాస విభాగం, కస్టోడియన్ ఆఫ్ ఎనిమీ ప్రాపర్టీ ఫర్ ఇండియా(సీఈపీఐ) అధికారులతో మంగళవారం బండి సంజయ్ సమీక్షించారు. స్వాతంత్ర్య సైనిక్ సత్కార యోజన(ఎస్‌ఎస్‌ఎస్‌వై) కింద 26,623, స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్ కోసం 8,829 ఫైళ్లు, ఎనిమీ ప్రాపర్టీస్ 12,800 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రికి అధికారులు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అవసరమైన పత్రాలు అందకే స్వాతంత్ర్య సమరయోధుల పింఛన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో సంబంధిత రాష్ట్రాలకు లేఖలు రాయాలని అధికారులను సంజయ్ ఆదేశించారు. వేగవంతంగా పింఛన్ మంజూరుకు ప్రత్యేక బృందాలను రాష్ట్రాలకు పంపాలని చెప్పారు. తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్ కేసుల పురోగతిపై వివరాలు అందించాలని, వచ్చే నెలలో సీఈపీఐ శాఖ కార్యాలయాలను స్వయంగా సందర్శించి పురోగతిని సమీక్షిస్తానని బండి సంజయ్ స్పష్టం చేశారు.



# ఉద్యోగాల భర్తీపై మంత్రి ఉత్తమ్ కీలక హామీ

ఈ కబురు: నీటిపారుదల శాఖలో ఆధునిక పరిజ్ఞానాన్ని అమల్లోకి తేవాలని.. సెంట్రల్ డిజైన్ విభాగం పటిష్ఠతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సెక్రెటేరియట్‌లో నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మేడిగడ్డ ఉదంతంలో జాతీయ భద్రత సంస్థతోపాటు జస్టిస్ ఘోష్ కమిషన్ చేసిన వ్యాఖ్యలతో సీడీఓ ప్రతిష్ట దెబ్బతిన్నదని అన్నారు. అటువంటి వ్యాఖ్యలపై సీడీఓ పునఃసమీక్షించుకుని సంస్కరణలు చేపట్టడం అత్యవసరమని సూచించారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందిస్తుందని స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సీడీఓను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ప్రాజెక్టుల డిజైన్ల రూపకల్పనలో ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అందుకు అవసరమైన లేటెస్ట్ సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒకప్పుడు సీడీఓ ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు యావత్ భారతదేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.వందేళ్ల క్రితం నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు నుండి మొదలు పెడితే ఉభయ తెలుగు రాష్ట్రాలలో నిర్మించిన ప్రధాన ప్రాజెక్ట్ నిర్మాణాలలో వినియోగించిన సాంకేతికత తెలంగాణ సీడీఓ ప్రతిభకు పట్టం కడుతుందన్నారు. అటువంటి ప్రతిభ చాటేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే.. సీడీఓలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఐఐటీలు, ఎన్ఐటీ నుంచి నీటిపారుదల శాఖలో నియమితులైన ఇంజినీర్లకు సీడీఓలో పోస్టింగ్ ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్నవి కావడంతో ప్రతిభావంతులైన ఇంజినీర్ల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్దిష్టమైన ఇంజినీరింగ్, సృజనాత్మక అవసరమని.. అది అత్యుత్తమ శిక్షణ పొందిన నిపుణుల ద్వారానే సాధ్యపడుతుందని చెప్పారు. పదవీ విరమణ పొందిన అనుభవం కలిగిన వారి సేవలు కుడా వినియోగించుకుని అద్భుతమైన ఫలితాలు రాబట్టాలన్నారు.

### నెల్లికల్లు, డిండి డిజైన్లు ఫైనల్ చేయాలి..

నీటిపారుదల శాఖ చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణంలో ఎలక్ట్రోమెకానికల్ ఇంజినీరింగ్ ప్రాముఖ్యత మునుముందు మరింత పెరగబోతున్నదని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. దాంతో లోతైన పరిజ్ఞానం కలిగి ఉన్న నిపుణులను నియమించడం ద్వారా సీడీఓ తిరిగి పూర్వవైభవం చాటుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఐఐటీ హైదరాబాద్, జేఎన్టీయూ, టీఎస్ జెన్ కో వంటి సంస్థలకు చెందిన వారిని నియమించే ముందు టైంబౌండ్ పద్ధతిలో డిజైన్ల రూపకల్పనలో ఉత్తమ నైపుణ్యాలను ప్రదర్శించడంతోపాటు సమయపాలనకు పెద్దపీట వేయాలన్నారు. నల్లగొండ జిల్లాలో నెల్లికల్లు, డిండి ఎత్తిపోతల పథకాల డిజైన్లను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఆలస్యం అయ్యే కొద్దీ రైతులకు నీరు అందించడంలో జాప్యం జరుగుతుందని చెప్పారు. డిజైన్లను తక్షణం ఆమోదించాలని ఉత్తమ్ అధికారులను ఆదేశించారు.



# గోషామహల్‌లో ఓజీహెచ్ నిర్మాణం సర్కారు నిర్ణయం

హైదరాబాద్, ఈ కబురు: గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా జనరల్ హాస్పిటల్ (ఓజీహెచ్) నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, అది ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయమని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. ఓజీహెచ్‌ను గోషామహల్ స్టేడియానికి తరలించడం చెల్లదని, అది స్థానిక ప్రజల హక్కులు, పర్యావరణం, జోనల్ రెగ్యులేషన్స్‌కు విరుద్ధమని పేర్కొంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరిగింది. దీనిపై చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఏజీ వాదనలు వినిపిస్తూ ఇప్పటికే అన్ని అనుమతులు పొంది, నిర్మాణాలు సైతం ప్రారంభించినట్లు తెలిపారు. పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణను సెప్టెంబర్ 26కు వాయిదా వేసింది.: రాష్ట్రవ్యాప్తంగా 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టుల భర్తీకి రెండు వారాల్లో నోటిఫికేషన్ జారీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ పరిధిలో 118 ఏపీపీ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ జూన్‌లో అనుమతి ఇచ్చింది. స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఈ పోస్టుల భర్తీ చేయనున్నారు. మొత్తం 262 ఏపీపీ పోస్టులు ఖాళీగా ఉండగా 118కి భర్తీకి అనుమతి లభించింది. ఆర్థిక శాఖ ఓకే చెప్పినా నోటిఫికేషన్ జారీ చేయడం లేదంటూ రామాంతపూర్‌కు చెందిన బొడ్డుపల్లి శ్రీనివాసులు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై మంగళవారం చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మోహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది.



# ఔటర్ వెలుపలకు కాలుష్య పరిశ్రమల తరలింపు వేగవంతం

**ఔటర్ వెలుపలకు కాలుష్య పరిశ్రమల తరలింపు వేగవంతం**

**అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశం**

హైదరాబాద్,ఈ కబురు: హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వెలుపలకు కాలుష్య కారక పరిశ్రమలను తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఆదాయ వనరుల సమీకరణ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. సబ్ కమిటీ సభ్యుడు, మంత్రి ఉత్తమ్ సమావేశంలో పాల్గొన్నారు. వాణిజ్య పన్నులు, ఖనిజాలు భూగర్భ వనరుల శాఖలు ఆదాయ ఆర్జనలో మెరుగైన పనితీరు కనబర్చాయని సబ్ కమిటీ సభ్యులు అభినందించారు. సమావేశంలో రాజీవ్ స్వగృహ, హౌజింగ్ బోర్డు కార్యకలాపాల ప్రగతి పైనా సమీక్షించారు

పెట్టుబడులపై భట్టి, దుద్దిళ్లతో యూకే బృందం భేటీ

హైదరాబాద్, ఈ కబురు: రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులతో యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రతినిధి బృందం మంగళవారం సమావేశమైంది. వీరితో రాష్ట్రంలో మాల్స్, ఆస్పత్రులు, ఆతిథ్య (హోటల్) రంగాల్లో పెట్టుబడులకున్న అవకాశాలపై ఈ బృందం చర్చించింది. యూకే బృందంలో జైల్స్ మెంబ్రే, మార్క్ అప్టన్, కోనల్ ఫెరేట్, నాగెన్ సనత్‌కుమార్, సాయి రత్నాకర్ పెంటపాటి, ఫణి గుడివాడ, అభి కొమ్మాని తదితరులు ఉన్నారు.



# కొత్త ఆదాయపన్ను బిల్లులోని ముఖ్యాంశాలు

అరవై ఏళ్ల నాటి ఆదాయపు పన్ను చట్టం 1961లో మార్పులు చేస్తూ.. కొత్త ఆదాయపు పన్ను బిల్లు 2025ను కేంద్రం ఫిబ్రవరి 13న లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ బిల్లు 2025కు తాజాగా ఆమోదం లభించింది. 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న భారత నూతన ఆదాయపు పన్ను బిల్లు 2025లో ప్రధాన మార్పులు కింది విధంగా ఉన్నాయి.



**కొత్త పన్ను బిల్లులోని కీలక సంస్కరణలు**
అద్దె ఆదాయం నుంచి మున్సిపల్ పన్నులను మినహాయించిన తర్వాత ప్రామాణిక మినహాయింపు (స్టాండర్డ్ డిడక్షన్) వర్తిస్తుంది.

స్వీయఆక్రమిత ఆస్తులకు మాత్రమే కాకుండా, ఖాళీ చేసిన ఆస్తులపై వడ్డీ తగ్గించేలా నిబంధనల్లో మార్పులు చేశారు. దీంతో రియల్ ఎస్టేట్ ఇన్వెస్టర్లు, భూస్వాములకు ప్రయోజనం చేకూరనుంది.

**కార్పొరేట్, బిజినెస్ ప్రొవిజన్స్**
కొత్త పన్ను విధానం కింద కార్పొరేషన్లు ఇప్పుడు సెక్షన్ 80ఎం కింద మినహాయింపులను క్లెయిమ్ చేసుకోవచ్చు. డివిడెండ్ ఆదాయంలో పన్ను తగ్గించుకోవచ్చు.

**కంపెనీలకు కనీస ప్రత్యామ్నాయ పన్ను (మ్యాట్) వర్తిస్తుంది.**
మినహాయింపులను క్లెయిమ్ చేసే నాన్‌కార్పొరేట్ సంస్థలకు ఆల్టర్నేటివ్ మినిమమ్ ట్యాక్స్ (ఏఎంటీ) వర్తిస్తుంది.

అధిక సంపాదన కలిగిన వారు(రూ.50 కోట్లు+ రశీదులు) నిర్దేశిత ఎలక్ట్రానిక్ చెల్లింపు పద్ధతులను తప్పనిసరిగా ఉపయోగించడం వల్ల ఆడిట్ మార్గాలు మెరుగుపడతాయి. లెక్కల్లోకి రాని ఆదాయాన్ని అరికట్టవచ్చు.

ధార్మిక ప్రయోజనాల కోసం ఉపయోగించే మూలధన లాభాలను ఇకపై 'ఆదాయ అనువర్తనం(అప్లికేషన్ ఆఫ్ ఇన్‌కమ్)'గా పరిగణిస్తారు. ఇది నిధుల కేటాయింపులో సౌలభ్యాన్ని పెంచుతుంది. ట్రస్టులు ఇకపై కూడబెట్టిన ఆదాయంలో 15% నిర్దిష్ట పద్ధతుల్లో పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. ఇది మరింత అనుకూలమైన ఆర్థిక ప్రణాళికకు ఉపయోగపడుతుంది.

**స్నేహపూర్వక చర్యలు**
నిర్దిష్ట పరిస్థితుల్లో ఆలస్యంగా రిటర్నులు దాఖలు చేసేవారు కూడా ఇప్పుడు రిఫండ్‌లను క్లెయిమ్ చేసుకోవచ్చు. కాకపోతే ఆలస్యానికి తగిన రుజువులు జత చేయాల్సి ఉంటుంది. కొన్నిసార్లు పన్ను అధికారులకు నిబంధనలు అతిక్రమించిన వారిపై విధించిన జరిమానాలను మాఫీ చేసే విచక్షణ ఉంటుంది. ఇది పన్ను చెల్లింపుదారుల హక్కులకు అనుగుణంగా ఉంటుంది. అయితే అందుకు తగిన కారణాలను సమర్పించాలి.

**పన్నులు మారుతాయా?**
కొత్త ఆదాయపన్ను బిల్లు 2025 అమల్లోకి రానున్న నేపథ్యంలో చాలామంది తాము ఏమేరకు పన్ను చెల్లించాలనేదానిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం గతంలో చెప్పినదాని ప్రకారమే పన్ను శ్లాబులు ఉంటాయి. అందులో ఎలాంటి మార్పులు ఉండవు. కేంద్రం గతంలో ప్రవేశపెట్టిన కొత్త శ్లాబుల ప్రకారం.. రూ.12,00,000 ఆదాయం వరకు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.



# లాభాలకు బ్రేక్.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

మంగళవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 368.48 పాయింట్లు లేదా 0.46 శాతం నష్టంతో.. 80,235.59 వద్ద, నిఫ్టీ 97.65 పాయింట్లు లేదా 0.40 శాతం నష్టంతో.. 24,487.40 వద్ద నిలిచింది.

టాప్ గెయినర్స్ జాబితాలో.. యాత్ర ఆన్‌లైన్, డబ్ల్యుఎస్ ఇండస్ట్రీస్, NDL వెంచర్స్, రికో ఆటో, సోనాటా సాఫ్ట్‌వేర్ కంపెనీలు చేరాయి. మ్యాన్ ఇండస్ట్రీస్ (ఇండియా), మార్క్‌సాన్స్ ఫార్మా, బ్యాంకో ప్రొడక్ట్స్ (ఇండియా), పిక్స్ ట్రాన్స్‌మిషన్స్, ఆస్ట్రల్ లిమిటెడ్ వంటి కంపెనీలు నష్టాలను చవిచూశాయి.

# పదేళ్ల వారంటీతో నిస్సాన్ కొత్త ప్లాన్: పూర్తి వివరాలు





**నిస్సాన్ ఇండియా కొత్తగా ప్రారంభించిన 'నిస్సాన్ మాగ్నైట్' కోసం 10 సంవత్సరాల ఎక్స్‌టెండెడ్ వారంటీ ప్లాన్‌ను ప్రారంభించింది. ఈ కారు సేఫ్టీలో 5 స్టార్ రేటింగ్ సాధించిన భారతదేశంలో అత్యంత సురక్షితమైన కాంపాక్ట్ ఎస్‌యూవీలలో ఒకటిగా నిలిచిన తరువాత కంపెనీ ఈ ప్లాన్ ప్రకటించింది.**

నిస్సాన్ ఇండియా ప్రారంభించిన కొత్త ప్లాన్‌లో 10 సంవత్సరాలు లేదా 2 లక్షల కి.మీ వారంటీని.. కేవలం రోజుకి రూ.12 లేదా కిలోమీటరుకు 0.22 పైసలకే ఎందుకోవచ్చు. వినియోగదారుడు 3+7, 3+4, 3+3, 3+2, లేదా 3+1 సంవత్సరాల వంటి ప్లాన్‌ల నుంచి తమకు నచ్చిన ప్లాన్ ఎంచుకోవచ్చు.

ఈ కవరేజ్‌లో ఏడు సంవత్సరాల పాటు సమగ్ర రక్షణ ఉంటుంది. ఎనిమిదవ, తొమ్మిదవ, పదవ సంవత్సరాలలో ఇంజిన్ అండ్ ట్రాన్స్‌మిషన్ కవరేజ్ ఉంటుంది. ఈ ప్లాన్ నిస్సాన్ అధీకృత వర్క్‌షాప్‌లలో నగదు రహిత మరమ్మతులను అందిస్తుంది.

ఈ ఆఫర్ అక్టోబర్ 2024 నుంచి 3 సంవత్సరాల ప్రామాణిక వారంటీతో విక్రయించబడే కొత్త నిస్సాన్ మాగ్నైట్ మోడళ్లకు మాత్రమే వర్తిస్తుంది. 2 సంవత్సరాల ప్రామాణిక వారంటీ కలిగిన పాత మాగ్నైట్ మోడళ్లకు ఈ ఆఫర్ లభించదు.

కొత్త నిస్సాన్ మాగ్నైట్ ఇటీవల గ్లోబల్ NCAP క్రాష్ టెస్టులో 5స్టార్ రేటింగ్ సాధించింది. ఆరు ఎయిర్‌బ్యాగులు, 67 శాతం హైటెన్సైల్ స్టీల్ బాడీ కలిగిన ఈ కారు.. ఏబీఎస్ విత్ ఈబీడీ, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, టీసీఎస్, హిల్ స్టార్ట్ అసిస్ట్, బ్రేక్ అసిస్ట్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టం వంటి అనేక సేఫ్టీ ఫీచర్స్ పొందుతుంది. కాగా కంపెనీ ఈ కారును సుమారు 65 కంటే ఎక్కువ దేశాల్లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.



# యెజ్డి రోడ్‌స్టర్ 2025 మోడల్ వచ్చేసింది: ధర ఎంతంటే?

యెజ్డి మోటార్‌సైకిల్ కంపెనీ.. ఇండియన్ మార్కెట్లో తన '2025 రోడ్‌స్టర్' బైక్ లాంచ్ చేసింది. కంపెనీ లాంచ్ చేసిన ఈ బైక్ ధర రూ. 2.10 లక్షలు (ఎక్స్‌షోరూమ్, ఢిల్లీ). చూడటానికి స్టాండర్డ్ మోడల్ మాదిరిగా ఉన్నప్పటికీ.. ఇది అప్డేటెడ్ డిజైన్ పొందుతుంది.

2025 యెజ్డి రోడ్‌స్టర్ ఆరు ఫ్యాక్టరీ కస్టమ్ కిట్‌లతో లభిస్తుంది. కాబట్టి ఇది సాధారణ రోడ్‌స్టర్ కంటే అద్భుతంగా ఉంటుంది. జావా బాబర్ బైక్ లాంటి సిల్హౌట్ ఈ బైకులో చూడవచ్చు. రీడిజైన్ టెయిల్ ల్యాంప్, ఇండికేటర్ వంటి వాటిని ఈ బైక్ పొందుతుంది. మాడ్యులర్ స్ప్లిట్ సీటు కలిగి ఉన్న ఈ బైకులో అప్డేటెడ్ ఫీచర్స్ ఉన్నాయి.

2025 యెజ్డి రోడ్‌స్టర్‌లో ఆల్ఫా2 ఇంజిన్ ఉంది. ఇందులోని 334 సీసీ సింగిల్ సిలిండర్ లిక్విడ్ కూల్డ్ యూనిట్ 29.1 హార్స్ పవర్, 29.6 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. ఇది అసిస్ట్ అండ్ స్లిప్పర్ క్లచ్‌తో 6 స్పీడ్ గేర్‌బాక్స్ ఆప్షన్ పొందుతుంది. ఈ అప్డేటెడ్ బైక్ ధర సాధారణ మోడల్ ధర కంటే రూ. 4000 ఎక్కువ అని తెలుస్తోంది.

# 'వారితో పనిచేయడం మీ అదృష్టం'.. జెన్Z ఉద్యోగులకు సుందర్ పిచాయ్ సూచనలు

గూగుల్‌లో ప్రొడక్ట్ మేనేజర్‌గా తన ప్రయాణం మొదలుపెట్టి.. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్‌కు సీఈవో అయ్యారు భారత్‌కు చెందిన సుందర్ పిచాయ్ . పదేళ్లుగా ఆయన ఆ సంస్థకు సీఈవోగా కొనసాగుతున్నారు. ఇటీవల బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి అడుగుపెట్టారు. గూగుల్‌ను 2.3 ట్రిలియన్ డాలర్ల సంస్థగా రూపుదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అయితే, ఇన్నేళ్ల కెరీర్‌లో తనకెదురైన అనుభవాలను ఇటీవల అమెరికన్ పాడ్‌కాస్టర్ లెక్స్ ఫ్రిడ్మాన్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా కెరీర్ ఎదుగుదలకు సంబంధించి జెన్Z ఉద్యోగులకు పలు కీలక సూచనలు చేశారు.





**మొదట్లో ఇబ్బందే.. కానీ!**
కెరీర్‌లో ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయని, తానూ అలాంటివి ఎదుర్కొన్నానని సుందర్ పిచాయ్ వివరించారు. వృత్తి జీవితంలో తోటి ఉద్యోగుల తీరుతో భయపడిన సందర్భాలూ అనేకం ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. అయితే, వాటిని తన వ్యక్తిగత అభివృద్ధికి తోడ్పడిన అంశాలుగానే చూసినట్లు తెలిపారు. జీవితంలో అనేక సందర్భాల్లో తన కంటే మెరుగైన వ్యక్తులతో పనిచేశానన్నారు. ‘‘మీరు మీకంటే మెరుగైన నైపుణ్యాలు, ప్రతిభ ఉన్న వ్యక్తులతో పనిచేసే అవకాశాన్ని కోరుకోవాలి. ఇలాంటి సందర్భాలు మొదట్లో కాస్త అసౌకర్యంగా అనిపించినా.. అవి నైపుణ్యాలను మెరుగుపరచడానికి, మీరు ఊహించని స్థాయికి ఎదగడానికి దోహదపడతాయి. అలాంటి వ్యక్తులతో పనిచేయడం వల్ల మీరు కొత్త విషయాలు నేర్చుకుంటారు. మీ సామర్థ్యాలను పరీక్షించుకున్నప్పుడే.. మీ పనితీరు మెరుగుపడుతుంది’’ అని అన్నారు సుందర్ పిచాయ్.

**కంఫర్ట్ జోన్ వద్దు**
‘‘జీవితం ఎంచక్కా ముందుకు సాగుతోంది కదా అని యువ ఉద్యోగులు కంఫర్ట్ జోన్‌లో ఉండిపోవద్దు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కోండి. అప్పుడే మీరేంటో మీకు తెలుస్తుంది. చాలాసార్లు మీకు మీరే ఆశ్చర్యంగా అనిపిస్తారు’’ అన్నారు. ఈ తరహా తత్వమే తనకు బాగా కలిసొచ్చిందని వివరించారు సుందర్. గూగుల్ సహ వ్యవస్థాపకులైన ల్యారీ పేజ్, సెర్గీ బ్రిన్ దృష్టిలో తాను పడటానికి, 2015లో గూగుల్ సీఈవోగా నియమితులవ్వడానికి ఇదే దోహదపడిందన్నారు.

**అభిరుచులకూ పెద్దపీట**
పూర్తిగా కెరీర్ మీద మాత్రమే ఫోకస్ చేయడం కాదు.. అప్పుడప్పుడూ అభిరుచులకూ పెద్దపీట వేయాలని జెన్Zకు సూచించారు పిచాయ్. మనసు చెప్పే మాట కూడా వింటూ ఉండాలని సలహా ఇచ్చారు. అప్పుడే జీవితాన్ని ఆస్వాదిస్తున్నామా? లేదా? అనే విషయం తెలుస్తుందన్నారు.

**గూగుల్ విజయం రహస్యం అదే..**
సరైన వ్యక్తిని కనుగొనడంలోనే గూగుల్ విజయ రహస్యం దాగి ఉందని సుందర్ పిచాయ్ చెప్పుకొచ్చారు. ‘‘ప్రయాణంలో మిషన్ ఓరియెంటెడ్ వ్యక్తులను గుర్తిస్తే.. వారు ప్రతిదీ శ్రద్ధగా చేయాలనే తపనతో ఉంటారు. అంతేకాదు మిగిలిన వ్యక్తులనూ ఆ దిశగా నడిపిస్తారు. దానివల్ల మరింత ఎక్కువ సాధించడం సాధ్యమవుతుంది’’ అని గూగుల్ విజయ రహస్యాన్ని చెప్పుకొచ్చారు పిచాయ్. తానూ ఉద్యోగులు తమ పనిని బాధ్యతాయుతంగా చేస్తారని విశ్వసిస్తానని పేర్కొన్నారు. టీమ్‌పై నమ్మకం ఉంచడం ద్వారా తాను ప్రశాంతంగా నాయకత్వ బాధ్యతల్లో కొనసాగుతున్నానని వివరించారు. అవసరమైన సందర్భాల్లో మాత్రమే తప్పులు సరిదిద్దే ప్రయత్నం చేస్తానని, కానీ అలాంటి సందర్భాలు చాలా తక్కువేనంటూ సుందర్ తన పాడ్‌కాస్ట్‌లో తెలిపారు.





# బంగారంపై సుంకం లేదు: డొనాల్డ్ ట్రంప్

బంగారం దిగుమతులపై అదనపు సుంకాలు ఉండవని అమెరికా అధ్యక్షుడు 'డొనాల్డ్ ట్రంప్' పేర్కొన్నారు. ఇటీవల ఆయన విధించిన సుంకాల పెంపు బంగారు కడ్డీలకు వర్తిస్తుందా?, లేదా?.. అనే దానిపై గందరగోళం చెలరేగిన కొన్ని రోజుల తర్వాత ఈ ప్రకటన చేశారు. ఈ విషయాన్ని ట్రంప్ సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్ట్ చేశారు.

బంగారం మీద సుంకాలు విధించడం వల్ల.. వీటి ధరలు మరింత ఎక్కువవుతాయి. ఇది ప్రపంచ వాణిజ్యాన్ని దెబ్బతీస్తుంది. కాబట్టి బంగారంపై సుంకాల విషయంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని నిపుణులు చెబుతున్నారు. కాగా ట్రంప్ చేసిన సోషల్ మీడియా పోస్ట్ తరువాత బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి.ట్రంప్ పోస్ట్ తర్వాత.. యూఎస్ గోల్డ్ ఫ్యూచర్స్ రేటు ఔన్సుకు 2.4 శాతం తగ్గి 3,407 డాలర్లకు చేరుకుంది. దీంతో బులియన్ మార్కెట్‌లో బంగారం ధర 1.2 శాతం మేర తగ్గి 3,357 డాలర్ల వద్ద నిలిచింది. గోల్డ్ మైనింగ్ కంపెనీల షేర్స్ కూడా తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే.. బంగారం ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది.

**భారతదేశంలో బంగారం ధరలు**
బంగారం ధరల పెరుగుదలకు బ్రేక్ పడింది. ప్రస్తుతం గోల్డ్ రేటు తగ్గుముఖం పడుతోంది. ఈ రోజు కూడా పసిడి ధరలు గరిష్టంగా రూ. 880 తగ్గింది. దీంతో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 101400 వద్దకు చేరింది. 22 క్యారెట్ల ధర రూ. 800 తగ్గి.. రూ. 92950 (10 గ్రామ్స్) వద్ద నిలిచింది.



## విదేశాల్లో తొలి షెడ్యూల్

కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు సందీప్ రెడ్డి కలయికలో 'స్పిరిట్' పేరుతో ఓ బహుభాషా చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్రిప్తి దిమ్రీ కథానాయిక. ఈ సినిమా సెప్టెంబరు నెలాఖరున పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. అయితే తొలి షెడ్యూల్ మాత్రం విదేశాల్లో మొదలు కానుందని సమాచారం. దీనికోసం సందీప్ ఇప్పటికే మెక్సికో, ఇండోనేషియా, మలేషియా, బ్యాంకాక్ తదితర దేశాల్లో లొకేషన్లు రెక్కీ చేసి పెట్టుకున్నారు. సినిమాలోని కీలక షెడ్యూల్స్‌ను అక్కడే ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. ప్రభాస్ నవంబరు నాటికి సెట్లోకి అడుగు పెట్టే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఆయన ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనువిందు చేయనున్నారు. సంగీత దర్శకుడు హర్ష వర్ధన్ రామేశ్వర్ ఈ చిత్ర పాటల్ని ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలిసింది.



## 'కాంతా'తో వెలిగిపోతుందా?


ప్రతిభ ఎక్కడున్నా ప్రోత్సహిస్తుంది సినిమా. ముఖ్యంగా నటీమణులకు అవకాశాలు తలుపుతడతాయి. అందుకు కొంచెం అందం, కాస్త అదృష్టం ఉంటే చాలు, ఇండియన్ సినిమానే ఏలేయవచ్చు. అలా యువ కథానాయకి భాగ్యశ్రీ బోర్సే ఇప్పుడు పాన్ ఇండియా ఇమేజ్‌పై కన్నేశారనే చెప్పవచ్చు. 26 ఏళ్ల ఈ మహారాష్ట్రీ పరువాల బ్యూటీ 2023లోనే నటిగా తెరంగ్రేటం చేశారు. అలా ముందుగా హిందీలో నటించిన భాగ్యశ్రీ బోర్సేకు వెంటనే టాలీవుడ్ నుంచి పిలుపు వచ్చింది. అక్కడ రవితేజకు జంటగా మిస్టర్ బచ్చన్ నటించారు. ఈ చిత్రం విజయాన్ని సాధించకపోకపోయినా ఈ అమ్మడు మాత్రం డాన్స్, అందాలారబోతలతో పాపులర్ అయ్యారు. తరువాత కింగ్డమ్‌లో విజయ్ దేవరకొండ సరసన నటించారు. ఆ చిత్రం సక్సెస్ అయ్యింది. ఇప్పుడు కాంతా అనే బహుభాషా చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో దుల్కర్‌సల్మాన్, సముద్రఖని ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

స్పిరిట్ మీడియా సంస్థ, వేఫారర్ ఫిలింస్ సంస్థతో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. కాంతా చిత్రం కన్నడం, తెలుగు, తమిళ భాషల్లో విడుదలకు ముస్తాబవుతోంది. ప్రతిభావంతులైన చిత్ర టీమ్‌తో కలిసి నటిస్తున్న కాంతా వంటి చిత్రం ద్వారా తమిళ ప్రేక్షకులకు పరిచయం కావడం సంతోషంగా ఉందన్నారు. కాగా ఈ చిత్రంలోని భాగ్యశ్రీబోర్సే ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఇటీవల విడుదల చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించిన ఈమె గెటప్ పలువురిని ఆకట్టుకుంది. ఈ భామ కోలీవుడ్‌లో ఏమాత్రం రాణిస్తారో వేచి చూద్దాం.

## ఓటీటీకి సూపర్ హిట్ క్రైమ్ థ్రిల్లర్.. స్ట్రీమింగ్ ఎక్కడంటే?

ఓటీటీల్లో క్రైమ్ థ్రిల్లర్స్‌కు ఫుల్ డిమాండ్ ఉంటోంది. దీంతో ఓటీటీలు సైతం అలాంటి కంటెంట్‌పైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నాయి. తాజాగా మరో థ్రిల్లర్ మూవీ బుల్లితెర ప్రియులను అలరించేందుకు వస్తోంది. డిఫరెంట్ స్టోరీ లైన్‌తో తెరకెక్కించిన గుడ్ డే మూవీ స్ట్రీమింగ్ డేట్ ఫిక్సయింది. ఓ తాగుబోతు క్రైమ్ ఇన్‌స్టిగేషన్‌లో ఎలా సాయపడ్డాడనే కోణంలో ఈ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీ ఆగస్టు 15 నుంచి ఓటీటీలో స్ట్రీమింగ్‌కు రానుంది. సన్ నెక్ట్స్‌లో ఓటీటీ ప్లే ప్రీమియం ద్వారా అందుబాటులోకి రానుంది. ఈ ఏడాది జూన్ 27న గుడ్ డే థియేటర్లలో రిలీజైంది. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమాకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. పోర్ణా జేఎస్ మైఖేల్ కథ అందించగా.. ఈ సినిమాకు ఎన్ అరవిందన్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ రామలింగం, మైనా నందిని, ఆదుకలం మురుగదాస్, కాళి వెంకట్, భగవతి పెరుమాల్, వేల రామమూర్తి కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీకి గోవింద్ వసంత గుడ్ డేకు సంగీతం అందించారు.








## 'తెలుగులో అల్లు అర్జున్'.. జాన్వీ కపూర్ రొమాంటిక్ మూవీ ట్రైలర్

సిద్ధార్థ్ మల్హోత్రా , జాన్వీ కపూర్ జంటగా నటించిన తాజా రొమాంటిక్ ఎంటర్‌టైనర్ పరమ్ సుందరి. తుషార్ జలోటా దర్శకత్వం వహించిన ఈ మూవీ విడుదలకు సిద్ధమైంది. ఇటీవలే క్రేజీ లవ్ సాంగ్‌ను రిలీజ్ చేసిన మేకర్స్.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. కేరళ అమ్మాయితో ఢిల్లీకి చెందిన అబ్బాయి ప్రేమలో పడితే ఎలా ఉంటుందనే ఆసక్తికర ప్రేమకథగా ఈ సినిమాను తెరకెక్కించారు.

తాజాగా రిలీజైన ట్రైలర్ చూస్తుంటే జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మధ్య సన్నివేశాలు నవ్వులు తెప్పిస్తున్నాయి. ఈ చిత్రాన్ని లవ్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తీర్చిదిద్దినట్లు ట్రైలర్‌లో అర్థమవుతోంది. ట్రైలర్ చివర్లో తమిళంలో రజినీకాంత్, మలయాళంలో మోహన్ లాల్, తెలుగులో అల్లు అర్జున్, కన్నడలో యశ్ అంటూ జాన్వీ కపూర్ చెప్పిన డైలాగ్ ఆడియన్స్‌ను అలరిస్తోంది. ఈ సినిమాను మాడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌లో దినేశ్ విజన్ నిర్మించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా ఆగస్టు 29న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ చిత్రంలో రెంజీ పనీకర్, సిద్ధార్థ్ శంకర్, మన్‌జోత్ సింగ్, సంజయ్ కపూర్, ఇనాయత్ వర్మ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాకు సచిన్ జిగర్ సంగీతమందించారు.



## 'రామ్ చరణ్ 200' స్టోరీ చెప్పిన ఉపాసన.. పేరు వెనుక పెద్ద కథే ఉందిగా!

సినిమా సెలబ్రిటీల జీవనశైలి ఎప్పుడూ ఒక మాయాజాలంలా అభిమానులను, సినీ ప్రియులను ఆకర్షిస్తుంది. వారు ధరించే దుస్తులు మొదలు వాడే వస్తువుల వరకు ప్రతి దాని గురించి తెలుసుకోవాలనే కుతూహలం అందరిలోనూ ఉంటుంది. వారు ఇళ్లలో ఎలా ఉంటారు? రోజువారీ జీవితంలో వారి ఆహారపు అలవాట్లు ఏమిటి? జీవిత భాగస్వామితో వాళ్లు ఎలా ఉంటారు? తదితర విషయాలపై అందరికి ఆసక్తి ఉంటుంది. అందుకే పలు ఇంటర్వ్యూల్లో సినీ ప్రముఖులు తమ పర్సనల్ లైఫ్ గురించి చెబుతుంటారు. తాజాగా మెగా కోడలు ఉపాసన తన భర్త రామ్ చరణ్ గురించి ఓ ఆసక్తికర విషయాన్ని అభిమానులతో పంచుకుంది.

### ఆ పేరుతో చరణ్ మొబైల్ నెంబర్

సాధారణంగా భార్యభర్తలు తమ భాగస్వామి మొబైల్ నెంబర్లను ముద్దు పేరుతో సేవ్ చేసుకుంటారు. మహిళలు అయితే తమ భర్త పేరుని హబ్బీ, బేబీ, స్వీట్‌హార్ట్, మై లవ్..తదితర పేర్లతో సేవ్ చేసుకుంటారు. కానీ ఉపాసన మాత్రం చరణ్ నెంబర్‌ని వెరైటీ పేరుతో సేవ్ చేసుకుంది. తన ఫోన్‌లో చరణ్ నెంబర్‌ని 'రామ్ చరణ్ 200' అనే పేరుతో సేవ్ చేసుకుందట. ఈ విషయాన్ని తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్వయంగా ఉపాసననే తెలియజేస్తూ..ఆ పేరు వెనుక ఉన్న కథ కూడా చెప్పింది.

### అందుకే ఆ పేరు..

చరణ్ నెంబర్‌ని రామ్ చరణ్ 200 అని ఎందుకు సేవ్ చేసుకుందో ఉపాసన వివరించింది. ప్రస్తుతం చరణ్ వాడుతున్న సిమ్ సంఖ్య ఇదట. ఇప్పటి వరకు ఆయన 199 సార్లు తన మొబైల్ నెంబర్‌ని మార్చుకున్నారట. ప్రస్తుతం వాడుతున్నది 200వ నెంబర్ అట. అందుకే రామ్ చరణ్ 200 అని సేవ్ చేసుకున్నానని నవ్వుతూ చెప్పింది ఉపాసన. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. చరణ్ 200 సార్లు మొబైల్ నెంబర్స్ మార్చారా? అంటూ నెటిజన్స్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.




## లావణ్య త్రిపాఠి పెళ్లి పాట వచ్చేసింది..!

వరుణ్ తేజ్‌తో పెళ్లి తర్వాత మెగా కోడలు లావణ్య త్రిపాఠి నటిస్తోన్న చిత్రం సతీ లీలావతి. ఈ మూవీలో దేవ్ మోహన్ హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాకు భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌లో నాగ మోహన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ నుంచి చిత్తూరు పిల్లా అంటూ సాగే సాంగ్‌ను రిలీజ్ చేశారు.

పెళ్లి వేడుకలో వచ్చే ఈ పాట అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ పెళ్లిపాటకు వనమాలి లిరిక్స్ అందించగా.. నూతన్ మోహన్, కృష్ణ తేజస్వీ, లితేష్ జి రావు పాడారు. ఈ మూవీకి మిక్కీ జే మేయర్ ఈ సంగీతమందిచారు. ఈ చిత్రంలో నరేష్, వీటీవీ గణేష్, సప్తగిరి, మొట్టా రాజేంద్రన్, జాఫర్ సాదిక్, తాగుబోతు రమేష్, జోషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# స్వర్ణ పతకం వెనక్కి.. మూడేళ్ల నిషేధం కూడా!



**న్యూఢిల్లీ:** డోపింగ్ వ్యవహారంలో పట్టుబడిన పలువురు ఆటగాళ్లపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) కొరడా ఝుళిపించింది. వీరందరినీ మూడేళ్ల పాటు నిషేధిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆటగాళ్లపై గతంలోనే నాలుగేళ్ల నిషేధం పడింది. అయితే ఈ ప్రకటన వచ్చిన 20 రోజుల్లోగా తమ తప్పును అంగీకరిస్తూ ముందుకు రావటంతో 'నాడా' చట్టంలోని నిబంధనల ప్రకారం ఒక ఏడాది నిషేధం తగ్గింది.

ఈ ఆటగాళ్లంతా స్టనొజొలోల్, మెటాండినోన్, నొరాన్‌డ్రోస్టెరాన్, మెఫంటర్‌మైన్‌వంటి నిషేధిక ఉత్ప్రేరకాలు తీసుకున్నట్లుగా పరీక్షల్లో తేలింది. నిషేధానికి గురైన ఆటగాళ్ల జాబితాలో ముగ్గురు అథ్లెట్లు ఉన్నారు. ఈ ఏడాది డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో డిస్కస్ త్రోలో స్వర్ణం సాధించిన గగన్ దీప్ సింగ్‌పై వేటు పడింది. పోటీల్లో అతను సర్వీసెస్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

**స్వర్ణం కూడా వెనక్కి**

ఇక గగన్‌నుంచి స్వర్ణం కూడా వెనక్కి తీసుకోనుండగా... రెండో స్థానంలో నిలిచిన నిర్భయ్ సింగ్ (హరియాణా)కు ఇప్పుడు పసిడి పతకం దక్కుతుంది. మరో ఇద్దరు అథ్లెట్లు సచిన్ కుమార్, జైను కుమార్ కూడా నిషేధానికి గురయ్యారు.

మోనికా చౌదరి, నందని వత్స్ (జూడో), ఉమేశ్‌పాల్ సింగ్, శామ్యూల్ వన్‌లల్‌తన్‌పుయ (పారా పవర్‌లిఫ్టింగ్), కవీందర్ (వెయిట్‌లిఫ్టింగ్), శుభమ్ కుమార్ (కబడ్డీ), ముగలి శర్మ (రెజ్లింగ్), అమన్, రాహుల్ తోమర్ (వుషు)పై కూడా 'నాడా' మూడేళ్ల వేటు వేసింది.



# రితిక 'పసిడి' పంచ్

**బ్యాంకాక్:** ఆసియా అండర్-22 బాక్సింగ్ చాంపియన్‌షిప్‌ను భారత్ స్వర్ణ పతకంతో ముగించింది. చివరిరోజు సోమవారం భారత్‌కు ఒక స్వర్ణం, నాలుగు రజతాలు లభించాయి. మహిళల ప్లస్ 80 కేజీల విభాగంలో రితిక భారత్‌కు పసిడి పతకాన్ని అందించింది. ఫైనల్లో రితిక 4:1తో అసెల్ తొక్తాసియన్ (కజకిస్తాన్)పై గెలిచింది. ఫైనల్స్‌లో ఓడిన యాత్రి పటేల్ (57 కేజీలు), ప్రియ (60 కేజీలు) రజత పతకాలతో సరిపెట్టుకున్నారు. పురుషుల విభాగంలో నీరజ్ (75 కేజీలు), ఇషాన్ కటారియా (ప్లస్ 90 కేజీలు) కూడా రజత పతకాలు సాధించారు. ఫైనల్స్‌లో బొల్తాయెవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో నీరజ్... ఖాలిమ్‌జన్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఇషాన్ ఓడిపోయారు.



# పిల్లలను కన్నాక ఎంగేజ్‌మెంట్ చేసుకున్న ప్రముఖ ఫుట్‌బాలర్

ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాలర్, పోర్చుగీస్ లెజెండ్ క్రిస్టియానో రొనాల్డో తన దీర్ఘకాలిక ప్రేయసి జార్జినా రోడ్రిగ్జ్‌తో నిశ్చితార్థం చేసుకున్నాడు. ఈ జంట ఎనిమిదేళ్ల ప్రేమ, ఐదుగురు పిల్లల పెంపకం తర్వాత తమ బంధాన్ని అధికారికం చేసింది. రొనాల్డోతో ఎంగేజ్‌మెంట్ విషయాన్ని జార్జినా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించింది.

రొనాల్డోజార్జినా ఇప్పటికే ఇద్దరు పిల్లలకు (అలానా మార్టినా (2017), బెల్లా ఎస్మెరాల్డా (2022)) తల్లిదండ్రులు. రొనాల్డోకు మరో ముగ్గురు సంతానం కూడా ఉన్నారు. వీరిలో క్రిస్టియానో రొనాల్డో జూనియర్ రొనాల్డో మొదటి భార్య కుమారుడు. క్రిస్టియానో రొనాల్డో జూనియర్ తర్వాత రొనాల్డో సరోగసి ద్వారా ఇద్దరు పిల్లలను కన్నాడు. ఎవా మారియా , మటేయో అనే వీరు 2017లో జన్మించారు. వీరి తర్వాత రొనాల్డో జార్జినాతో అలానా మార్టినా, బెల్లా ఎస్మెరాల్డా, ఆంజెల్‌ను కన్నాడు. అయితే బెల్లా ట్విన్ బ్రదర్ అయిన ఆంజెల్ జన్మ సమయంలోనే మరణించాడు.

**రొనాల్డో-జార్జినా ప్రేమ కథ**

రొనాల్డోజార్జినా 2016లో మాడ్రిడ్‌లోని Gucci షాప్‌లో మొదటి సారి కలుసుకున్నారు. 2017 ఫిఫా అవార్డుల ప్రధానోత్సవంలో వీరిద్దరు మొదటిసారి పబ్లిక్ అపియరెన్స్ ఇచ్చారు.

జార్జినా రోడ్రిగ్జ్ (31, అర్జెంటీనా) ఓ ప్రముఖ మోడల్, ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్, ఎంటర్‌టైనర్ మరియు వ్యవసాయదారురాలు. ఆమె జీవిత ప్రయాణం సాధారణ వెయిట్రెస్ ఉద్యోగంతో మొదలైంది. ఆమె నెట్‌ఫ్లిక్స్‌లో అనే డాక్యుమెంటీతో బాగా పాపులరైంది.

# ఆసియా కప్.. జట్టు ఎంపిక సెలెక్టర్లకు పెద్ద తలనొప్పే!

ప్రతిష్ఠాత్మక ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు యూఏఈ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్‌లు టీ20 ఫార్మాట్లో జరగనున్నాయి. అఫ్గానిస్థాన్, హాంకాంగ్ పోరుతో ఈ ట్రోఫీ ప్రారంభం కానుంది. టీమ్‌ఇండియా తన మొదటి మ్యాచ్ సెప్టెంబర్ 10న యూఏఈతో ఆడనుంది. ఈ నేపథ్యంలో అజిత్ అగార్కర్ నేతృత్వంలోని బీసీసీఐ సెలెక్షన్ కమిటీ ఆగస్టు 19 లేదా 20వ తేదీల్లో జట్టును ప్రకటించే అవకాశముంది. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ స్పోర్ట్స్ సైన్స్ బృందం పంపే ఆటగాళ్ల వైద్య నివేదికల ఆధారంగా జట్టు ఎంపిక జరగనుంది. ఇటీవలే హెర్నియా శస్త్రచికిత్స చేయించుకున్న టీమ్‌ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌నెస్‌పై అప్పుడే అనుమానాలు తొలగనున్నాయి. ప్రస్తుతమైతే అతడు బెంగళూరులో నెట్స్‌లో సాధన చేస్తున్నాడు.

**మల్లగుల్లాలు తప్పక పోవచ్చు!**

అభిషేక్ శర్మ, సంజు శాంసన్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ఎంపిక దాదాపు ఖరారైనట్లే. ఐపీఎల్ 2025లో అద్భుత ప్రదర్శన చేసి, ప్రస్తుతం సైతం భీకర ఫామ్‌లో ఉన్న టీమ్‌ఇండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు టీ20 జట్టులో స్థానం కల్పించాలంటే మాత్రం సెలెక్టర్లకు పెద్ద తలనొప్పే! అలాగే దూకుడుకు పెట్టింది పేరైన యశస్వి జైస్వాల్ , సాయి సుదర్శన్‌ను ఏ స్థానంలో ఆడించాలనే విషయంలో కూడా మల్లగుల్లాలు పడాల్సిరావొచ్చు. ప్రస్తుతమున్న పోటీ నేపథ్యంలో కేఎల్ రాహుల్‌కు




ఆసియా కప్ జట్టులో స్థానం దక్కకపోవచ్చు. సంజు శాంసన్ తర్వాత రెండో కీపర్ కోసం జితేశ్ శర్మ, ధ్రువ్ జురెల్ మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. వీరిద్దరిలో ఒక్కరిని మాత్రమే టీమ్‌లోకి తీసుకోవాల్సి ఉంది. ఎవరిని ఎంపిక చేయాలి అనే అంశం.. సెలెక్టర్లకు కత్తిమీద సామే. జితేశ్ శర్మ ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. మంచి ఫినిషనర్‌గా కూడా రాణించాడు.

**అంత సులువు కాదు..**

ఇంగ్లాండ్ టూర్‌లో గాయపడ్డ నితీశ్ కుమార్ రెడ్డి.. ఆసియా కప్ నేపథ్యంలో టీమ్‌ఇండియాకు ఎంపికయ్యే సూచనలు లేవు. శివమ్ దూబేకు స్క్వాడ్‌లో స్థానం దక్కించుకునే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. స్పిన్ ఆల్‌రౌండర్ల విభాగంలో వాషింగ్టన్ సుందర్ , అక్షర్ పటేల్ జట్టులోకి రానున్నారు. బుమ్రా , అర్షదీప్ సింగ్ ఎంపిక లాంఛనమే! గత ఐపీఎల్‌లో 25 వికెట్లు తీసుకున్న ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా.. వీరిద్దరిలో ఎవరో ఒకరే జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ ఇద్దరు బౌలర్లలో ఒకరిని ఎంపిక చేయడమూ సెలెక్టర్లకు అంత సులువు కాదు.

# 2036 ఒలింపిక్స్ భారత్‌లో.. చర్చలు కొనసాగుతున్నాయన్న కేంద్ర మంత్రి

**న్యూఢిల్లీ:** 2036లో ఒలింపిక్స్‌ను నిర్వహించాలని ఆసక్తి కనబరుస్తున్న భారత్ ఈ దిశగా తమ ప్రయత్నాలు కొనసాగిస్తోంది. ఒలింపిక్ నిర్వహణా హక్కుల ప్రక్రియలో భాగంగా రెండో దశలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)తో తాము 'నిరంతర చర్చలు' కొనసాగుతున్నాయని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు.

పార్లమెంట్‌లో ఆప్ పార్టీ ఎంపీ గుర్‌మీత్ సింగ్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఆయన ఈ వివరాలు వెల్లడించారు. 'ఒలింపిక్స్ నిర్వహణ బిడ్డింగ్ ప్రక్రియను పూర్తిగా భారత ఒలింపిక్ సంఘం పర్యవేక్షిస్తోంది. ఇప్పటికే తమ ఆసక్తిని కనబరుస్తూ ఐఓసీకి లెటర్ ఆఫ్ ఇన్‌టెంట్‌ను ఐఓఏ ఇచ్చింది. దీనిపై ఐఓసీలో భాగమైన ఆతిథ్య కమిషన్‌తో సంప్రదింపులు సాగుతున్నాయి.

అయితే ఒకవేళ భారత్‌కు క్రీడలను కేటాయిస్తే వేదికలు ఏమిటనే విషయంపై ఇప్పుడే చర్చ అవసరం. మన దేశానికి ఒలింపిక్స్‌ను కేటాయించడమే అన్నింటికంటే ముఖ్యం' అని మంత్రి స్పష్టం చేశారు. ఒలింపిక్స్ హక్కుల కేటాయింపులో రెండో దశ అయిన 'కంటిన్యూయస్ డైలాగ్'లో బిడ్ వేసిన ఆయా దేశాల సన్నద్ధత, ఆర్థిక పరిస్థితి, ఆ దేశంలో సాధ్యాసాధ్యాలపై ఐఓసీ ఒక అంచనాకు వస్తుంది.

2036 క్రీడల కోసం భారత్‌తో పాటు ఖతర్, టర్కీ కూడా పోటీ పడుతున్నాయి. అయితే ప్రస్తుతానికి ఈ



దశను ఐఓసీ నిలిపివేయడం గమనార్హం! ప్రస్తుత ఐఓసీ అధ్యక్షురాలు కిర్‌స్టీ కొవెంట్రీ స్వయంగా ఈ విషయాన్ని చెప్పింది. '2028, 2032 క్రీడలతో పాటు 2030లో జరిగే వింటర్ గేమ్ ఆతిథ్య హక్కులు కూడా వరుసగా లాస్ ఏంజెలిస్, బ్రిస్బేన్, ఫ్రెంచ్ ఆల్ప్స్‌కు ఇప్పటికే ఇచ్చేశాం. ముందు వీటి నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, ఇతర అంశాలపై దృష్టి పెట్టాల్సి ఉంది. ఇలాంటి స్థితిలో 2036 క్రీడల కేటాయింపు గురించి ఆలోచించడం అనవసరం. అందుకే డైలాగ్ ప్రక్రియను ఆపేస్తున్నాం. ఐఓసీ సభ్యులందరూ దీనికి మద్దతు పలికారు' అని గత నెలలో కొవెంట్రీ స్పష్టం చేసింది.

మరోవైపు భారత్‌లో ఫుట్‌బాల్ అధ్వాన్న పరిస్థితిపై అడిగిన ప్రశ్నకు మాండవీయ సమాధానిస్తూ... 'ఈ విషయంలో భారత ఫుట్‌బాల్ సమాఖ్యదే పూర్తి బాధ్యత. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సూచన ప్రకారం వారు అన్ని అంశాలు పర్యవేక్షిస్తున్నారు. ప్రపంచ ర్యాంకింగ్స్ ఎన్నో అంశాలపై ఆధారపడి ఉంటాయి కాబట్టి దానికి అంత ప్రాధాన్యత ఇవ్వనవసరం లేదు' అని చెప్పారు.

# ఆ డబుల్ సెంచరీ గుర్తుండిపోతుంది.. అవార్డు రావడం సంతోషం: గిల్

**టీమిండియా టెస్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ కు అంతర్జాతీయ క్రికెట్ మండలి అవార్డు లభించింది. జూలై నెలకు గానూ అతడు 'ఐసీసీ మెన్స్ ప్లేయర్ ఆఫ్ ది మంత్ ' అవార్డు గెలుచుకున్నాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన ఆండర్సన్- టెండుల్కర్ ట్రోఫీ సిరీస్‌లో అదరగొట్టడం ద్వారా గిల్‌కు ఈ గౌరవం దక్కింది.**

**భారీ డబుల్ సెంచరీ**

ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా భారత టెస్టు జట్టు కెప్టెన్‌గా యువ క్రికెటర్ శుబ్‌మన్ గిల్ పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో శతక్కొట్టి (147)న ఈ కుడిచేతి వాటం బ్యాటర్.. బర్మింగ్‌హామ్‌లో ఏకంగా భారీ డబుల్ సెంచరీ (269), సెంచరీ (161) సాధించి ఈ వేదికపై భారత్‌కు తొలి గెలుపు అందించాడు.

అంతేకాకుండా.. మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్టులో మరోసారి శతకం (103) బాది ఈ మ్యాచ్‌ను టీమిండియా డ్రా చేసుకోవడంలో గిల్ తన వంతు పాత్ర పోషించాడు. ఇక ఆఖరిదైన ఐదో టెస్టులో బ్యాటర్‌గా విఫలమైనా.. కెప్టెన్‌గా విజయం సాధించి..




సిరీస్‌ను 22తో సమం చేయగలిగాడు.

**754 పరుగులు**

ఇక ఇంగ్లండ్‌తో ఓవరాల్‌గా ఐదు టెస్టుల సిరీస్‌లో శుబ్‌మన్ గిల్.. పది ఇన్నింగ్స్‌లో కలిపి 754 పరుగులు సాధించాడు. ఈ క్రమంలో జూలై నెలకు గానూ 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డుకు అతడు నామినేట్ అయ్యాడు. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్, సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ వియాన్ ముల్డర్ నుంచి గట్టి పోటీ ఎదుర్కొన్న గిల్.. ఎట్టకేలకు వీరిద్దరిని అధిగమించి అవార్డును సొంతం చేసుకున్నాడు. నాలుగోసారి.. అత్యంత మధురమైన క్షణం అదే కాగా 25 ఏళ్ల గిల్ ఈ పురస్కారం అందుకోవడం ఇది నాలుగోసారి. ఈ నేపథ్యంలో గిల్ స్పందిస్తూ.. ''జూలై నెలకు గానూ ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు అందుకోవడం గొప్పగా అనిపిస్తోంది. ఈసారి టీమిండియా టెస్టు కెప్టెన్ హోదాలో.. నా ప్రదర్శనకు గానూ ఈ పురస్కారం అందుకోవడం ఇంకా సంతోషంగా ఉంది.

బర్మింగ్‌హామ్‌లో డబుల్ సెంచరీ సాధించడం ఇంగ్లండ్ పర్యటన మొత్తంలో నాకు అత్యంత మధురమైన క్షణం. ఇంగ్లండ్ గడ్డ మీద కెప్టెన్‌గా జట్టును ముందుకు నడిపించడం గొప్ప అనుభవం. ఇరుజట్లు అద్భుత పోరాట పటిమ కనబరిచాయి.

నాకు ఈ అవార్డు దక్కేలా చేసిన జ్యూరీ మెంబర్లకు ధన్యవాదాలు. అదే విధంగా.. సిరీస్ ఆసాంతం అద్భుత ప్రదర్శన కనబరిచిన నా సహచర ఆటగాళ్లకు శుభాకాంక్షలు. దేశం కోసం మరింత గొప్పగా ఆడేందుకు నేను ఎదురుచూస్తున్నాను'' అని గిల్ ఉద్వేగపూరిత వ్యాఖ్యలు చేశాడు. కాగా ఐసీసీ ఓటింగ్ అకాడమీతో పాటు ఆన్‌లైన్ ద్వారా వచ్చే అభిమానుల ఓట్ల ఆధారంగా 'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు విజేతను నిర్ణయిస్తారు.